జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 15 సంచిక 98 విశాఖపట్నం గురువారం 23 డిసెంబరు 2021 8 పేజీలు వెల : 5.00

# ఒమిక్రాన్ టెన్షన్... రెండు రోజులు లాక్ డౌన్!

న్యూఢిల్లీ, డిసెంబర్ 22, :అగ్రరాజ్యమైన అమెరికాతో పాటు ప్రపంచ దేశాలను సైతం అతలాకుతలం చేస్తోంది కరోనా మహమ్మారి. కొత్త వేరియంట్‌లు బయట పడుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మొన్నటి వరకు డెల్టా వేరియంట్‌తోనే ప్రపంచ దేశాలు తలమునకలయ్యాయి. కొన్ని దేశాల్లో డెల్టా వేరియంట్ తగ్గుముఖం పట్టినా మరికొన్ని దేశాల్లోనైతే డెల్టా ప్రభావం కొనసాగుతూనే ఉంది. ఈ తరుణంలో తాజాగా దక్షిణాఫ్రికాలో వెలుగు చూసిన మరో కొత్త వేరియంట్ ఒమిక్రాన్ ఇప్పటికే పలు దేశాలకు వ్యాప్తి చెందింది. కరోనా ఎఫెక్ట్‌తో పలు దేశాలు ఆర్థికంగా దెబ్బతిన్నాయి. అందుకే సంపూర్ణ లాక్‌డౌన్ కూడా విధించలేక పాక్షిక లాక్‌డౌన్, కోవిడ్ నిబంధనలకే పరిమితమయ్యాయి. భారత్‌లో కూడా ఆర్థికంగా ప్రభుత్వాలపై భారం పడటం, డెల్టా వేరియంట్ ప్రభావం తగ్గుతుండటంతో పలు రాష్ట్రాలు సెకండ్ వేవ్‌పై కూడా ఎక్కువగా ఆంక్షలు విధంచలేదు. అయితే ఇప్పుడు వ్యాప్తి చెందుతున్న ఒమిక్రాన్ వేరియంట్ డెల్టా కంటే 6 రెట్లు వేగంగా వ్యాపిస్తోంది. ఒమిక్రాన్ బారిన పడిన దేశాల్లో ఒకటైన యూకేలో ఇప్పటికే ఒమిక్రాన్ మరణాలు మొదలయ్యాయి. ఈ రోజు తాజాగా అమెరికాలోని టెక్సాస్‌లో ఒక ఒమిక్రాన్ మరణం సంభవించింది. ఇప్పటికే భారత్‌లోకి ప్రవేశించిన ఒమిక్రాన్ వేరియంట్ పలు రాష్ట్రాల్లో దాని ప్రభావాన్ని చూపుతోంది. భారత్‌లో




ఉన్న జనాభా ప్రకారం ఒమిక్రాన్ వ్యాప్తి ఇక్కడ మరింత వేగంగా ఉండేందుకు అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఒమిక్రాన్ ఎదుర్కొనేందుకు ఎలాంటి ఆలోచనలు చేస్తోందని కొందరు ప్రశ్నలు కురిపిస్తున్నారు. ఇటీవల ఒమిక్రాన్‌పై స్పందించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఒమిక్రాన్‌పై కోవిడ్ టీకాలు సైతం ప్రభావం చూపడం లేదని స్పష్టం చేశారు. దీంతో బూస్టర్ డోస్‌పై కూడా స్పష్టత లేకుండా పోయింది. అయితే ఈ నెల డిసెంబర్ కావడంతో 25వ తేదీన క్రిస్మస్ పండుగతో పాటు న్యూయర్ వేడుకల్లో యువత భారీగా పాల్గొనే అవకాశం ఉంది. ఒమిక్రాన్ వేరియంట్ వ్యాప్తికి వేదికగా ఈ న్యూయర్ వేడుకలు ఆతిథ్యమిచ్చేలా కనిపిస్తున్నాయి. డిసెంబర్ 31, జనవరి 1 తేదీల్లో లాక్‌డౌన్ విధిస్తారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. కానీ వీటిపై అధికారికంగా స్పష్టత లేదు. ఫస్ట్, సెకండ్ లాక్‌డౌన్‌లు విధించినప్పుడే ఆర్థికంగా కుదేలైన భారత్‌లో మరోసారి ఒమిక్రాన్ వ్యాప్తి వేళ లాక్‌డౌన్‌కు ఆస్కారం ఉందా.. లేదా..? అనే సందేహాలు ప్రజలు మదిలో మెదులుతున్నాయి.



## మోదీ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జగన్

న్యూఢిల్లీ: 75 ఏళ్ల స్వాతంత్ర్య ఉత్సవాల సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ బుధవారం వివిధ రాష్ట్రాల సీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తెలంగాణ గవర్నర్ తమిళిసై, టీఎస్ సీఎం చంద్రశేఖర్ రావు (కేసీఆర్) పాల్గొన్నారు.

## విపత్తుల నిర్వహణకు టీటీడీ కీలక నిర్ణయం..



తిరుపతి : ఇటీవల తిరుమలలో కురిసిన భారీ వర్షం ఎంతటి నష్టాన్ని మిగిల్చిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తిరుమల గిరుల్లో కొండ చరియలు విరిగి పడడంతో ఘాట్ రోడ్ ధ్వంసమైంది. దీంతో లింక్ రోడ్డుతో భక్తులకు తిరుమలకు వెళ్లడానికి అధికారులు అవకాశం కల్పించారు. అయితే అంతలోనే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. దీంతో ఇకపై అలాంటి పరిస్థితులు పునారవృతం కాకూడదని టీటీడీ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు.వరదలు, కొండచరియలు విరిగి పడడం లాంటి ప్రకృతి విపత్తులు సంభవించినపుడు వెంటనే స్పందించి భారీ నష్టం జరగకుండా తగిన చర్యలు చేపట్టేందుకు టీటీడీ చర్యలు చేపట్టింది. ఇందుకు వీలుగా విపత్తుల నిర్వహణ మాన్యువల్ రూపొందిస్తున్నట్టు టిటిడి జెఈవో సదా భార్గవి తెలిపారు. విపత్తులు సంభవించినపుడు శ్రీవారి భక్తులకు సరైన సమాచారంతోపాటు మనోధైర్యం కల్పించేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ విషయమై బుధవారం తిరుపతిలోని శ్వేత భవనంలో అధికారులతో సమీక్ష సమావేశంలో నిర్వహించారు. ఈవో డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి సమీక్ష నిర్వహించి విపత్తుల నిర్వహణకు తగిన మార్గదర్శకాలు రూపొందించాలని సూచించారని భార్గవి తెలిపారు.

## ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన వైఎస్సార్‌సీపీ ఎంపీలు



ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీని వైఎస్సార్‌సీపీ ఎంపీలు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సహకరించాలని ప్రధానికి ఎంపీలు విజ్ఞప్తి చేశారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా వైఎస్సార్‌సీపీ ఎంపీలు కలిశారు. ఏపీ పెండింగ్ సమస్యలపై చర్చించారు.

## నా తల్లిని అన్నవారిని వదిలిపెట్టను: నారా లోకేశ్



గుంటూరు: "నా తల్లిని విమర్శించడం బాధించింది. నా తల్లిపై ఆరోపణలు చేసిన వారిని వదిలిపెట్టం" అని టీడీపీ నేత నారా లోకేశ్ హెచ్చరించారు. మంగళగిరిలో లోకేశ్ పర్యటించారు. వార్డుల్లో తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిడమర్రు రోడ్డులో డంపింగ్ యార్డును ఆయన పరిశీలించారు. డంపింగ్ యార్డు మారుస్తామని చెప్పి ఎమ్మెల్యే మాట తప్పారని దుయ్యబట్టారు. వరద బాధితులను ఆదుకుంటే ఆరోపణలు చేస్తారా? అని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అందరి లెక్కలు తేలుస్తామని నారా లోకేశ్ హెచ్చరించారు. లోకేష్ మంగళగిరి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. నియోజకవర్గంలో అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ఇటీవల మరణించిన కార్యకర్తలు, నాయకుల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్నారు. ప్రజల సమస్యల పరిష్కారంపై స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిని నిలదీస్తున్నారు. వారానికోసారి వచ్చి ఫొటోలు దిగి జంప్ అయిపోతున్నారని ఎద్దేవాచేశారు. సీఎం ఉంటున్న నియోజకవర్గంలోనే అభివృద్ధికి దిక్కులేదని తప్పుబట్టారు. చెత్త సీఎంల జాబితాలో దేశంలోనే జగన్‌రెడ్డి నెంబర్ వన్ అని లోకేష్ ధ్వజమెత్తిన విషయం తెలిసిందే.

## ఏపీలో పలు థియేటర్లు సీజ్..

### కొనసాగుతున్న తనిఖీలు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సినిమా థియేటర్లపై అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన పలు థియేటర్లను బుధవారం సీజ్ చేశారు. నూజివీడు, అవనిగడ్డ, గుడివాడలో తనిఖీలు చేపట్టారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ టిక్కెట్ల ధరలు, ఫుడ్ స్టాల్స్‌లో ధరలపై అధికారులు ఆరా తీశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు.కృష్ణాజిల్లాలో జాయింట్ కలెక్టర్ మాధవీలత ఆధ్వర్యంలో తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కృష్ణాజిల్లాలో 12 థియేటర్లు సీజ్ చేశామని తెలిపారు. లైసెన్సులు రెన్యూవల్ చేయని థియేటర్లు సీజ్ చేశామని పేర్కొన్నారు. తనిఖీలు రెగ్యులర్‌గా కొనసాగుతాయన్నారు. బెనిఫిట్ షోలకు తప్పకుండా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు సైతం తనిఖీలు చేస్తారన్నారు. పెద్ద హీరోల సినిమాలకు, పెద్ద సినిమాలకు రేట్లు పెంచితే చర్యలు తీసుకుంటామన్నారు. థియేటర్లలో తిను బండరాలు, పార్కింగ్ విషయంలో దోపిడీ చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని జాయింట్ కలెక్టర్ మాధవీలత పేర్కొన్నారు.

## సీఎం జగన్ కడప జిల్లా పర్యటన

**ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు జిల్లాలో పర్యటన**

**గోపవరం, ప్రొద్దుటూరు, కొప్పర్తి, ఇడుపులపాయ, పులివెందుల ప్రాంతాల్లో కార్యక్రమాలు**

**ప్రొద్దుటూరు, పులివెందులలో బహిరంగ సభలు**



కడప సిటీ/అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన ఖరారైంది. ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ఆయన పర్యటించనున్నారు. జిల్లాలోని గోపవరం, ప్రొద్దుటూరు, కొప్పర్తి, ఇడుపులపాయ, పులివెందుల ప్రాంతాల్లోని వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, శిలాఫలకాలు ఆవిష్కరించనున్నారని తెలిపారు. అలాగే ప్రొద్దుటూరు, పులివెందులలో నిర్వహించే బహిరంగ సభల్లో సీఎం పాల్గొని ప్రసంగించనున్నారు.



## పాడి పరిశ్రమ లో యరబోలు బ్రదర్స్ విజయం

### వై.యస్.ఆర్ అవార్డు గ్రహీత లకు సత్కారం



కావలి, డిసెంబర్ 22 ప్రజాపాలన ప్రతినిధి పాడి పరిశ్రమ లో నూతన ఆవిష్కరణ లతో రాష్ట్ర ప్రభుత్వం ప్రశంసలు అందుకున్న యరబోలు బ్రదర్స్ భవిష్యత్తులో దేశానికి ఆదర్శం అవుతారనడంలో సందేహం లేదని పలువురు అభినందించారు. పాడి పరిశ్రమ లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి వై.యస్.ఆర్ అవార్డు లు పొందిన ఫర్టైల్ గ్రీన్ సి.ఇ.ఒ వై.శ్రీహర్షారెడ్డి, మేనేజింగ్ పార్టనర్ వై.శివ అభిరామ్ రెడ్డి లను స్థానిక జవహర్ భారతి శంకరన్ హాల్ లో ఘనంగా సత్కరించారు. విశ్వోదయ రెక్టర్ దొడ్ల వినయ్ కుమార్ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతుల నేతృత్వంలో జవహర్ భారతి కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జవహర్ భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ శిరీష లు హర్ష, అభిరామ్ లు చిన్న వయసులో సాధించిన విజయం అద్భుతమైన దని కొని యాడారు. ప్రభుత్వ ఉద్యోగాలే లక్ష్యంగా నిరాశ లో మునిగి పోతున్న యువతకు వీరు మార్గదర్శకం అని అన్నా రు. జవహర్ భారతి డైరీ సైన్స్ మాజీ విభాగాధిపతి డాక్టర్ మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఆధునిక పరిశ్రమల ఏర్పాటు కు మోజు చూపుతున్న నేటి తరుణంలో వ్యయప్రయాసలకు గురి చేసే పాడి పరిశ్రమ లోకి యరబ్రోలు సోదరులు ప్రవేశించడం, ఆధునిక సాంకేతిక తను వినియోగించి విజయం సాధించడం విశేషమని కొనియాడారు. యరబ్రోలు బ్రదర్స్ తమకు లభించిన సత్కారం కు స్పందిస్తూ తమ తండ్రి విజయ శంకర్ రెడ్డి ఇచ్చిన ప్రోత్సాహంతో తమకు విజయం లభించిందని, భవిష్యత్తు లో కావలి పేరు నిలబెట్టే లా అంకిత భావంతో కృషి చేసి మరిన్ని విజయాలు సాధిస్తామని అందుకు ఆశీస్సులు ఇవ్వాలని కోరారు. వీరి స్ఫూర్తితో మరిన్ని విజయాలు భవిష్యత్తు డైరీ సైన్స్ విద్యార్థులు సాధించాలని విశ్వోదయ రెక్టర్ వినయ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా కోరారు.

## నూతన పీసీసీ సభ్యులకు, ఆమంచి చేతుల మీదుగా ఘనసన్మానం





చీరాల(ఒంగోలు) : సెయింట్ మార్క్ సెంటినరీ లూథరన్ చర్చి నూతన పీసీసీ సభ్యులుగా, ఎన్నిక అయిన బొనిగల సాంబయ్య, పేర్లీ ఆనంద్ బాబు లకు,వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ చేతుల మీదుగా, ఘనసన్మానం చెయ్యటం జరిగింది.

## 3,117 మంది విదేశీ మైనారిటీలకు పౌరసత్వం: కేంద్రం



న్యూఢిల్లీ: సిటిజన్ షిప్ యాక్ట్ (సీఏఏ)కు సంబంధించిన నిబంధనలను భారత ప్రభుత్వం ఇంకా రూపొందించాల్సి ఉన్నప్పటికీ విదేశీ మైనారిటీ శరణార్థులకు గణనీయంగానే భారత పౌరసత్వం కల్పించినట్టు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఆఫ్ఘనిస్థాన్, పాక్, బంగ్లాదేశ్‌కు చెందిన 3,117 మంది మైనారిటీలకు ఈదేశ పౌరసత్వం కల్పించినట్టు కేంద్రం తాజాగా ప్రకటించింది. 2018 నుంచి ఇంతవరకూ భారత పౌరసత్వం పొందిన వారి గణాంకాలను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ రాజ్యసభకు బుధవారంనాడు ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో వివరించారు. 2018 నుంచి 2021 వరకూ పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల హిందూ, సిక్కు, జైన్, క్రిస్టియన్ మైనారిటీ గ్రూపులకు చెందిన 8,244 మంది భారత పౌరసత్వం కోరుతూ దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వీరిలో ఇప్పటి వరకూ 3,117 మందికి భారత పౌరసత్వం కల్పించామని చెప్పారు.







## ఘనంగా పొన్నూరు మ్యాక్స్ సొసైటీ ఆవరణలో

# పొన్నూరు ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో దాల్ మిల్ నూతన ప్రారంభోత్సవం

## సెమి క్రిస్మస్ మరియు నూతన సంవత్సరము 2022 వేడుకలు



పొన్నూరు, ప్రజాపాలన ప్రతినిధి : ముందుగా డా.బి.ఆర్.అంబేద్కర్ గారి చిత్ర పటానికి పూలదండలు వేసి నివాళులు అర్పించుట జరిగినది. పొన్నూరు ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో దాల్ మిల్లును అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ చుక్క తిరుమలాదేవి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. మరొక అతిధి కోటక్ బ్యాంక్ మేనేజర్ సాయిబామా దామరాజు దాల్ మిల్ మొదటి యూనిట్ ను ప్రారంభించారు. దాల్ మిల్ రెండవ యూనిట్ ను రిటైర్డ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రటరీ యస్.జాకబ్ గారు ప్రారంభించారు. మూడవ యూనిట్ ను టి.ప్రతాప్ కుమార్ ప్రాభించారు.

అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ చుక్కా తిరుమలాదేవి మాట్లాడుతూ పొన్నూరు మ్యాక్స్ సొసైటీ పొన్నూరు పరిసర ప్రాంత రైతులకు నాణ్యమైన ఎరువులు విత్తనాలు పురుగు మందులను సకాలంలో సరసమైన ధరలకు అందిస్తూ, రైతుల మన్ననలు పొందుతూ, అపరాలైన మినుములను నేరుగా రైతుల నుండి కొనుగోలు చేసి దాల్ మిల్ ద్వారా సరసమైన ధరలకు అందజేయుట అభినందనీయమని అన్నారు. స్నేహా గ్రూప్ ఆర్గనైజేషన్ ఛైర్మన్ డా. కటికల శివ భాగ్యారావ్ గారి సేవలను కొనియాడారు.

కోటక్ బ్యాంక్ మేనేజర్ సాయి భామా దామరాజు మాట్లాడుతూ ఇటువంటి వినూత్నమైన యూనిట్లకు ప్రభుత్వ, బ్యాంకుల పరంగా ప్రోత్సాహం ఉంటుందని క్రిస్టమస్ వేడుకల ప్రాముఖ్యత ను కొనియాడి నారు. రిటైర్డ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రెటరీ యస్.జాకబ్ గారు మాట్లాడుతూ అంబేద్కర్ గారి ఆశయాల కనుగుణంగా డా.కటికల శివ భాగ్యారావ్ గారి సేవలను అభినందించారు.నాటి సభకు డా.కాగిత వరప్రసాదరావు అధ్యక్షత వహించినారు. పై కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ శ్రీ సి.హెచ్.సత్యానంద్ ,స్నేహా మ్యాక్స్ సి.ఈ. ఓ.గుమ్మడి మనోరంజన్ , శ్రీ వేళం కృపానందం , పెదపూడి సుధాకర్, డా.టి.విజయ్ కుమార్ , గురజాల శ్రీనివాసరావు, యం. పరమానందకుమార్ , పి.ప్రకాశం , వంశీ, స్నేహా మ్యాక్స్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు. రేవ్. యోహాను ప్రార్థనా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అతిథులను పొన్నూరు ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ మరియు స్నేహా మ్యాక్స్ సొసైటీ తరుపున ఘనంగా సన్మానించారు.

# భవానీ దీక్షా విరమణ మహోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ జె.నివాస్ , నగర సిపి టికె రానా



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : స్నానఘట్టలు , హోమగుండాలు , క్యూలైన్లు , గిరి ప్రదక్షణ , ఏర్పాట్లు పరిశీలన భవాని భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఈనెల 25 నుంచి 29 వరకు జరగనున్న భవానీ దీక్షా విరమణ మహోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె . నివాస్ చెప్పారు.బుధవారం భవానీ దీక్షా విరమణ మహోత్సవం ఏర్పాట్లను నగర సిపి కాంతి రానా టాటా , నగర మున్సిపల్ కమిషనర్ వి . ప్రసన్న వెంకటేష్ తో కలిసి స్నానఘట్టలు , హోమగుండాలు , క్యూలైన్లు , గిరి ప్రదక్షణ , ఏర్పాట్లను పరిశీలించారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జె . నివాస్ మాట్లాడుతూ భవానీ దీక్షా విరమణ మహోత్సవ ఏర్పాట్లపై ఇటీవల దేవాదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఇరిగేషన్ , వియంసి , ఆలయ , పోలీస్ , రెవెన్యూ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏపనిని ఎవరు చేయాలో స్పష్టంగా తెలియజేయడం జరిగిందన్నారు . ఈనెల 25 నుంచి 29 వరకు భవానీ భక్తులకు అవసరమైన సౌకర్యాలను అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు . సుమారు 3 నుంచి 4 లక్షల మంది భవానీలు అమ్మవారి మాల విరమణ చేసేందుకు వస్తారని అంచనా వేస్తున్నమన్నారు . ఇందుకు అనుగుణంగా ఎవరికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు . స్నానాల నిర్వహణకు స్నానఘట్టల్లో జల్లుల స్నానం , మహిళలు బట్టలు మార్చుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు . కేశనఖండ వద్ద ఎటువంటి రద్దీ లేకుండా సాఫీగా జరిగేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేశామన్నారు . భవానీలు స్నానం అనంతరం విడిచిన బట్టలను ఎక్కడ పడితే అక్కడ విడిచిపెట్టకుండా అందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు . గిరి ప్రదక్షణలో ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డలకు మరమత్తులు పూర్తి చేస్తున్నామన్నారు . కోవిడ్ను దృష్టిలో ఉంచుకుని అమ్మవారి దీక్షా విరమణలకు వచ్చే వారు వ్యాక్సినేషన్ వేసుకుని రావాలని ఆయన సూచించారు . అదేవిధంగా తప్పని సరిగా మాస్కు ధరించాలని , కోవిడ్ నిబంధలను పాటించాలని ఆయన కోరారు . నగర సిపి టికె రానా మాట్లాడుతూ భవానీ దీక్షా విరమణకు 2 వేల మందితో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు . హోమగుండాలు , స్నానఘట్లలో పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామన్నారు . గిరిప్రదక్షణలో వాహనాలతో ఇబ్బందులు తలెత్తకుండా వాకింగ్ ట్రాక్ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు . దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను ట్రాఫిక్ మళ్లించడంతోపాటు పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి వాహనాలను పార్కింగ్ చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు . సీతామ్మ పాదాల నుంచి పున్నమిఘాట్ , గిరిప్రదక్షణ ప్రాంతాన్ని , ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన హోమగుండాల ఏర్పాట్లను కలెక్టర్ జె . నివాస్ నగర సిపి టికె రానా , మున్సిపల్ కమిషనర్ వి . ప్రసన్న వెంకటేష్ జాయింట్ కలెక్టర్ కె . మోహన్ కుమార్ , సబ్ కలెక్టర్ జి . సూర్యసాయి ప్రవీణ్ చంద్ తదితర అధికారులు సుమారు 2 గంటలకు పైగా విస్తృతంగా పర్యటించి పరిశీలించారు . తొలుత సీతామ్మ పాదాల వద్ద స్నానఘాట్లలో ఏర్పాట్లను పరిశీలించారు . కేశనఖండశాల ఏర్పాట్లను పరిశీలించి ఎటువంటి రద్దీ లేకుండా , ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఏర్పాట్ల పై పలు సూచనాలు అందజేశారు . గత ఏడాది 2 టిక్కెట్ కౌంటర్లు ఉండగా ఈ ఏడాది 4 టిక్కెట్ కౌంటర్లు ఏర్పాటు చేశారు . క్రౌడ్ మేనేజ్మెంట్పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు . భవానీ ఘాట్ , పున్నమిఘాట్ సందర్శించి భక్తులకు అవసరమైన సమాచారాన్ని తెలిపే సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు . అనంతరం గిరిప్రదక్షణ రూట్ సందర్శనలో భాగంగా భవానిపురం నుంచి చిట్టినగర్ , వాగు సెంటర్ , రావిచెట్టు సెంటర్ కొత్తపేట , బ్రహ్మణవీధి , మీదుగా ఆలయ మెట్ల ప్రాంగణానికి చేరుకున్నారు . ఇక్కడ ఏర్పాటు చేసిన 4 హోమగుండాలను అందుకు అవసరమైన క్యూలైన్ ఏర్పాట్లను వారు పరిశీలించి పలు సూచనలను అధికారులకు అందజేశారు . వీరి వెంట జాయింట్ కలెక్టర్ కె . మోహన్ కుమార్ , విజయవాడ సబ్ కలెక్టర్ జి . సూర్యసాయి ప్రవీణ్ చంద్ , పోలీస్ ఉన్నతాధికారులు కె . బాబురావు , డా . కె . హనుమంతరావు , టి . సర్కార్ , యం వెంకటేశ్వర్లు , దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ వి . సత్యనారాయణ , నియంఓ హెచ్ డా . గీతాబాయి , ఆలయ కార్యనిర్వహక ఇంజనీయర్ డివి భాస్కర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు .

## పగలు వైస్సార్ నేతల అక్రమ వసూళ్ళతో.. రాత్రి చెడ్డీ గ్యాంగ్‌ల భయంతో బెంబేలెత్తుతున్న ప్రజలు

### నరసరావుపేట నియోజకవర్గ టీడుపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు



నరసరావుపేట. ప్రజాపాలన : నరసరావుపేట పట్టణంలో పగలు వైస్సార్సీపీ నేతల అక్రమ వసూళ్ళతో రాత్రి చెడ్డీ గ్యాంగ్ భయంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు అన్నారు.నరసరావుపేట పట్టణంలోని స్థానిక 01 వార్డ్ చంద్రబాబు నాయుడు కాలనీ నందు ప్రజా ఛైతన్య యాత్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన గడపగడపకు తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.వైసీపీ నేతలు సంక్షేమ పథకాలు అందాలంటే ముడుపులు చెల్లించాల్సిందేనని వైసిపి నాయకులు,వాలంటీర్లు ఒత్తిళ్ళకు గురి చేస్తున్నారని మహిళలు డా.చదలవాడకు తెలిపి వాపోయారు.వారితో డా.చదలవాడ మాట్లాడుతూ చెడ్డీ గ్యాంగ్ కంటే వైసీపీ నేతల బెదిరింపులతో భయపడవద్దని ఎవరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల నిమిత్తం ముడుపులు చెల్లించవద్దని అలా ముడుపులు వసూళ్ళకు పాల్పడే వారి పై తక్షణమే తమకు ఫిర్యాదు చేస్తే ఉన్నత అధికారులకు తెలిపి వారి పై చర్యలు చేపట్టే విధంగా కృషి చేస్తామని ఎటువంటి బెదిరింపులకు ఎవరూ భయపడవద్దని స్థానికులకు డా.చదలవాడ అరవింద బాబు ధైర్యం చెప్పారు.ప్రజలంతా చంద్రన్న పాలనతోనే అభివృద్ధి సాధ్యమని అభిప్రాయపడుతున్నారని డా.చదలవాడ స్పష్టం చేశారు. పెరిగిన ధరలతో పాటు చెత్తా పన్ను,ఓ.టి.ఎస్ తదితర పన్నులతో వేధిస్తున్నారని పేర్కొన్నారు.తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నాయకులు,కార్యకర్తలు కృషి చేసి నారా చంద్రబాబునాయుడు ని అధికారంలోకి రావడానికి కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు దాసరి ఉదయశ్రీ,పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరు శేఖర్,మైనార్టీ పట్టణ అధ్యక్షులు బడే బాబు,వార్డు నాయకులు ప్రత్తిపాటి పుల్లయ్య, పోలయ్య,కొల్లి నరసింహారావు,మల్లి,మన్నన్ షరీఫ్, మబు,పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి మహమ్మద్ రఫీ, పెరికల రాయప్ప,సుబ్బారావు,చెన్నయ్య,మాబు,నాగూర్,ఖలీల్,సైదావలి,సంజీవ రావు,పోత్తూరి శీను,బంగారం, నరసింహారావు, రామకృష్ణ,సుబ్బారావు,మాదిన కాజా, సాంబయ్య,సుభాని,అజగర్,వీరయ్య, బాబావలి,రమేష్,గని,సైదమ్మ,అంజలి, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.బి

## రంగన్న గూడెం లోఘనంగా జరిగిన ధ్వజస్తంభ,విగ్రహాల ఊరేగింపు



గన్నవరం, ప్రజాపాలన ప్రతినిధి డిసెంబర్ 22:బాపులపాడు మండలం రంగన్న గూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ దేవాలయం ఈ నెల 24వ తేదీన శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ట జరుగుతున్న నేపథ్యంలో దానికి సంబంధించి ఊరి పొలిమేర వరకు ఈ రోజు వచ్చిన శ్రీకృష్ణుని నల్లరాతి విగ్రహం, టేకు ధ్వజస్తంభాన్ని శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమం నిర్వహించి గ్రామంలోని వీధుల గుండా ఘనంగా ఊరేగించారు. గ్రామములోని భక్తులందరూ స్వామివారి కి తమ ఇళ్ల దగ్గర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట కృష్ణారావు, గ్రామ సర్పంచ్ కసుకుర్తి రంగా మణి,మాజీ సర్పంచ్ లు మైనేని గోపాలరావు, శ్రీమతి ఆళ్ళ మణి కృష్ణ, శ్రీకృష్ణ దేవాలయం కమిటీ సభ్యులు కాట్రు పాపారావు, కోలుసు శ్రీమన్నారాయణ, కోలుసు బలరాం, మంద పాటి రాంబాబు,కొలుసు సాంబశివరావు, కొలుసు గంగా జలం, గ్రామ ప్రముఖులు కసుకుర్తి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు మాట్లాడుతూ రంగన్న గూడెం గ్రామంలో మొట్టమొదటిసారిగా జీవ ధ్వజస్తంభం తో శ్రీకృష్ణ దేవాలయం నిర్మించడం చాలా ఆనందంగా ఉందని దేవాలయాలు మన సంస్కృతి, సాంప్రదాయాల కు ప్రతీక అన్నారు.

# ఓటిఎస్ లబ్ధిదారులకు దస్తావేజులు పంపిణీ

భీమవరం, డిసెంబర్ 22 (ప్రజాపాలన ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటిఎస్ పథకంలో మీఇల్లు మీకే సొంతమని ఇంటిపై సర్వహక్కులు మీవేనని శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఓటిఎస్ పథకంలో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న లబ్ధిదారులకు దస్తావేజులను పంపిణీ చేసే కార్యక్రమం స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏపథకం ప్రవేశ పెట్టినా ప్రజల సంక్షేమం కోసమేనని అన్నారు. రాష్ట్ర గృహనిర్మాణశాఖ నుండి సబ్సిడీతో కూడిన రుణాలతో ఇళ్లను నిర్మించుకున్న లబ్ధిదారులకు నేడు ఆఇంటిపై సర్వహక్కులు కలిగిఉండేలా ఓటిఎస్ పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. అసలు, వడ్డీ కలిపి పెద్దమొత్తంలో చెల్లించాల్సి ఉన్నప్పటికీ పేదలను దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాలలో రూ 10 వేలు పట్టణ ప్రాంతాల్లో రూ 15 వేలు కార్పొరేషన్ ప్రాంతాలలో రూ 20 వేల చొప్పున ప్రభుత్వానికి చెల్లించి, ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వచ్చేఏడాది ఉగాది వరకు ఈపథకం అమలులో ఉంటుందని పైసా ఖర్చులేకుండా ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేస్తుందని ఈపథకం వల్ల లబ్ధిదారులకు అన్ని విధాలుగా ఉపయోగవేనని అన్నారు .దేశంలోని ఏరాష్ట్రంలో కూడా ఇటువంటి పథకాన్ని అమలుచేయడం లేదని కేవలం మన రాష్ట్రంలోనే పేదవారికి సొంతింటి హక్కు ఉండేలా ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి చర్యలు తీసుకున్నారని అన్నారు. ప్రజలకు మేలుజరిగే కార్యక్రమాన్ని చంద్రబాబుతో పాటు ఇతర ప్రతిపక్షాలు అడ్డుకునే యత్నం చేస్తున్నాయని ఇది ధర్మంకాదని అన్నారు. 2004లో మొదటిసారి ఎమ్మెల్యే గా పనిచేస్తున్నప్పుడు తాడేరు రోడ్లో 700 వ్యక్తిగత గృహాలను నిర్మించడం జరిగిందని అన్నారు. ఆనాడే 82 ఎకరాలను పేదలకు ఇళ్ల స్థలాల కోసం



సేకరించడం జరిగిందని నేడు ఈ భూమిలో టిడ్కో పథకంలో ఇండ్లను నిర్మిస్తున్నామని అన్నారు. నేడు పట్నంలో పేదల ఇళ్ల స్థలాల కోసం 150 ఎకరాలు దాటి భూసేకరణ చేయడం జరిగిందని ఇప్పటికే 60 ఎకరాలను పూడ్చడం జరిగిందని తెలిపారు. ప్రతిపక్ష నాయకులు ఓటీఎస్ పథకంపై తప్పుడు ఆరోపణలుచేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు అంటేనే మోసం, దగా, కుట్ర అని, 2014 ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చి గద్దెఎక్కిన తర్వాత ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని వ్యాఖ్యానించారు. 2019 లోనే చంద్రబాబు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని, అయినా ఆయన వైఖరిలో మార్పు రాకపోవడం ఆయనకే చెల్లిందని అన్నారు. గత రెండు సంవత్సరాల పాటు కరోనా ప్రభావంతో రాష్ట్ర ఆదాయం మరింతగా పడిపోయినప్పటికీ ఇచ్చిన మాటప్రకారం ప్రజలకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలను అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందని అన్నారు. ఇంటిపై సర్వహక్కులు కలిగిననాడు ఆదస్తావేజుల ద్వారా తమ కుటుంబ అవసరాల నిమిత్తం బ్యాంకుల నుండి రుణాలు పొందవచ్చని అన్నారు. తమ పిల్లలకు వారసత్వపు ఆస్తిగా కూడా ఇవ్వొచ్చని అన్నారు. .అంతేకాకుండా ఇంటికి సంబంధించిన దస్తావేజులు ఉంటే భరోసాగా కూడా ఉంటుందని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన దస్తావేజులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపురం సబ్ కలెక్టర్ విష్ణు చరణ్ ,డీసీఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకట స్వామి, ఎంసి చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జడ్పిటిసి కాండ్రేగుల నరసింహారావు, తాసిల్దార్ ఏ వి రమణరావు, మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల, హౌసింగ్ డీఈ వెంకటరమణ, సర్పంచులు కోళ్ల బాలకృష్ణ, తిరుమాని శ్రీనివాస్ ,జల్లా కొండయ్య , రాటనాల స్వామి, ఆరేటి వీరస్వామినాయుడు, ఎంపీటీసీలు మైనపు వెంకటేశ్వరరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, రాష్ట్ర అవుట్సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వర్తి సత్యనారాయణ, నాయకులు మద్దాల వెంకట సత్య నరసింహారావు , కోడే యుగంధర్ ,ఏ ఎస్ రాజు, పాలవెల్లి మంగ, అల్లూరి నాగవల్లి, మానేపల్లి నాగబాబు, ఎడ్వర్డ్ ,పిల్లి మునలయ్య, జంగం మాణిక్యాలరావు, నా మన మహేష్ ,కోమటి రాంబాబు, నల్లం రాంబాబు తదితరులు లు పాల్గొన్నారు.



## ఆపద్బాంధవుడు మన వేగేశానా నరేంద్ర వర్మ

బాపట్ల ప్రజాపాలన బ్యూరో :బాపట్ల పట్టణం లో ని 7వ వార్డు ఉప్పరపాలెం కు చెందిన ఆసోది హరికృష్ణ రెడ్డి ఇల్లు మంగళవారం అగ్ని ప్రమాదం జరుగగా ఆయన ను పరామర్శించి తన వంతు ఆర్థిక సహాయం అందచేసిన బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వర్లు , ఉపాధ్యక్షుడు కూచిపూడి శ్యాం సుందర్ , బాపట్ల నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు ఎం శేషు కృష్ణ , బాపట్ల పార్లమెంటు టి యన్ ఎస్ యఫ్ ప్రధాన కార్యదర్శి కుర్రా ధనేంద్ర ,7వ వార్డు మాజీ కౌన్సలర్ గోపి రెడ్డి , కృష్ణరెడ్డి , శేషారెడ్డి ,శివశంకర రెడ్డి , కేశన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కోసూరు కిడ్నీ అండ్ స్కిన్ హాస్పిటల్ లో సెమీ క్రిస్మస్ వేడుకలు




నరసరావుపేట. ప్రజాపాలన :నరసరావుపేట పట్టణంలోని కోసూరు కిడ్నీ అండ్ స్కిన్ హాస్పిటల్ లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాస్టర్లు క్రీస్తు బోధలను వినిపించారు. సెమీ క్రిస్మస్ వేడుకలు సందర్భంగా డాక్టర్ కోసూరి శ్రీనివాస్, డాక్టర్ కోసూరి తరణి ఆధ్వర్యంలో లో ఆస్పత్రి ఆవరణలో పేదలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో డాక్టర్ కొండపల్లి. నాగేశ్వరరావు, డాక్టర్ పచ్చవ గిరిబాబు, డాక్టర్ పచ్చవ. విజేత పాల్గొన్నారు, వైద్యులు మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ఆదర్శంగా తీసుకొని సుఖ సంతోషాలతో ప్రజలందరూ ఉండాలని,కోవిడ్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.అనంతరం అందరితో కలిసి విందు భోజన కార్యక్రమం నిర్వహించారు.

## జీఓ నెంబర్ 59 ను కొనసాగించాలి



బాపట్ల ప్రజాపాలన బ్యూరో :- బాపట్ల సచివాలయం మహిళ పోలీసులను హోమ్ డిపార్ట్మెంట్ లోనే కొనసాగించాలని జీఓ నెంబర్ 59 ను కొనసాగించాలని ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పని చేస్తాం అని నైట్ డ్యూటీ లు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ బాపట్ల పట్టణ సీఐ పి. కృష్ణయ్య కు వినతిపత్రం ఇస్తున్న బాపట్ల పలు వార్డులకు సంబంధించిన మహిళా పోలీసులు ఈ వినతి పత్రాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళాలి అని వారి విన్నపము.

## ఆర్టీసీ బస్టాండ్ లో ఖాళీగా ఉన్న రూమ్ లకు టెండర్లు: డిపో మేనేజర్ హరి



కావలి డిశంబర్ 22 ప్రజాపాలన ప్రతినిధి:ఆర్టీసి బస్టాండ్ లలోని ఖాళీ రూములు, ఖాళీ స్థలాలలో వ్యాపారము చేసుకొనుటకు వ్యాపారుల నుండి సీల్డుకవర్ టెండర్లను ఆర్టీసీ ఆహ్వానిస్తుందని ఆర్టీసి కావలి డిపో మేనేజర్ కె.హరి పేర్కొన్నారు. కావలి డిపో పరిధిలో కావలి బస్టాండ్ లో రెండు పక్కా రూములు, 9 ఖాళీ స్థలాలు, జలదంకి బస్టేషన్ లో ఒక రూమ్, ఒక ఖాళీ స్థలం, కలిగిరి బస్టేషన్ లో పది ఖాళీ స్థలాలు వ్యాపారాలకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 29వతేది సాయంత్రం 5గంటలలోగా కావలి డిపో కార్యాలయంలో టెండరు ఫారాలు నగదు చెల్లించి పొందాలని, పూర్తిచేసిన టెండరు ఫారాలను నెల్లూరు రీజనల్ మేనేజర్ కార్యాలయంలో 30వ తేది మద్యాహ్నం 2గంటలలోగా టెండర్ పెట్టెలో వేయాలని డిపో మేనేజర్ వివరించారు. కాగా రీజియన్ పరిధిలో మొత్తం 120 రూములు, ఖాళీ స్థలాలకు టెండర్లు ఆహ్వానించారని, టెండర్ ఫారాలు ఏ డిపోలోనైనా పొందవచ్చని అన్నారు. ఇతర వివరాలకు 738288 4216 ( సీనియర్ సహాయకులు), లేదా 7382884213 ( మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్ ) లేదా 9959225643 ( డిపో మేనేజర్ ) ఫోన్ నంబర్లను సంప్రదించాలని అన్నారు.

## పోత్తూరి వెంకటరమణ పై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం: డియస్పీ



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)యడ్లపాడు మండలం గత రాత్రి బోయపాలెం - ఉన్నవ గ్రామాల మధ్యలో పొత్తూరి.వెంకట నారాయణ అను వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడం వలన తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు అందిన సమాచారం మేరకు మా రూరల్ ఎస్పీ శ్రీ విశాల్ గున్ని ఐపీఎస్ ఆదేశాల మేరకు సత్వరమే స్పందించామని తెలిపిన నరసరావుపేట డిఎస్పీ శ్రీ విజయ భాస్కర్ బాధితుడు వద్దకు వెళ్లి అతన్ని విచారించగా అతను బోయపాలెం నుండి మద్యం తాగి వెళ్తుండగా మార్గం మధ్యలో ఎవరో ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసారని చెప్పగా,అతను చెప్పిన సమాచారం ఆధారంగా వెంటనే హత్యయత్నం కేసు నమోదు చేశామని తెలిపిన డీఎస్పీ తెలిపారు.దాడి చేయడానికి గల కారణాలను దర్యాప్తు జరిపే క్రమంలో విచారిస్తుండగా బాధితుడు ఒక విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లలోని రాగి తీగ దొంగతనం కేసులలో ముద్దాయిని అని తెలిసిందని తెలిపారు.గతంలో ఇతని మీద గుంటూరు జిల్లాలోని నల్లపాడు,చిలకలూరిపేట రూరల్ మరియు ప్రకాశం జిల్లాలోని మార్టూరు,జే.పంగళూరు పోలీస్ స్టేషన్లలో నాలుగు కేసులు నమోదైనవని తెలిపారు. వైద్యులు మరియు విద్యుత్ శాఖ అధికారులు జరిపిన ప్రాథమిక పరీక్షలో బాధితుని శరీరంపై ఉన్న గాయాలు విద్యుత్ షాక్ వలన కలిగినవి తెలియవచ్చినదని తెలిపారు.శాస్త్రీయంగా మరియు సాంకేతిక పరంగా లోతైన దర్యాప్తు జరిపి నిజానిజాలను నిర్ధారిస్తామని తెలిపారు.బాధితునిపై జరిగిన దాడిని తీవ్రంగా పరిగణించి, పారదర్శకంగా మరియు నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రూరల్ ఎస్పీ శ్రీ విశాల్ గున్ని ఐపిఎస్ ఆదేశించారని డీఎస్పీ తెలిపారు.

## అయ్యప్ప స్వామికి విశేష అభిషేకం, గ్రామోత్సవం: పెరుగు శ్రీనివాస్ కరెంటు ఏ ఇ



బాపట్ల :బాపట్ల స్థానిక శ్రీ సోమేశ్వర స్వామి వారి దేవాలయంలో అయ్యప్ప పీఠం నుండి 108 కలశములతో బాపట్ల సి పి డి సి ఏ ఇ పెరుగు శ్రీనివాసరావు మరియు కొట్టికం సుబ్బారావు స్వామి వారి ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించి అయ్యప్ప స్వామి వారికి విశేష అభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అయ్యప్పలు భవానీలు గోవిందలు పాల్గొన్నారు అర్చకులు గోపాలాచారి, మరియు బూర్లె రామ సుబ్బారావు కె మోహన్ రావు మరియు భక్త జనులు పాల్గొన్నారు.

## ఓటుకు ఆధార్ అనుసంధానం బిల్లు ఆమోదం పొందడం మంచిదే: నవతరంపార్టీ జాతీయ అధ్యక్షుడు రావుసుబ్రహ్మణ్యం




చిలకలూరిపేట:(కాకతీయ)ఓటుకు ఆధార్ అనుసంధానం చేసే బిల్లు ఆమోదించడం మంచిదే అని, అదేమాదిరిగా ఈవీఎంలు రద్దు చేయాలని బిల్లుపెట్టాలని నవతరంపార్టీ జాతీయ అధ్యక్షుడు రావుసుబ్రహ్మణ్యం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. బ్యాలెట్ పద్ధతిలో భారతదేశంలో భవిష్యత్ ఎన్నికలు జరపాలని అన్నారు. చిలకలూరిపేట లోని నవతరంపార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో రాష్ట్రవ్యాప్తంగా అన్నీ కలెక్టర్ కార్యాలయాల ముందు ఓటుకు ఆధార్ అనుసంధానం చేయాలని, ఈవీఎంలు రద్దు చేయాలని వాటి స్థానంలో బ్యాలెట్ పద్ధతి ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని నవతరంపార్టీ పెద్ద ఎత్తున ఉద్యమం చేసిన విషయం గుర్తు చేసారు.కేంద్ర ప్రభుత్వం ఈవీఎంలు రద్దు బిల్లు తేవాలని, భారత ఎన్నికల కమిషన్ కు ఈవీఎంలు రద్దుకు సిఫార్సు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకు ఈవీఎంలు రద్దుకు ఉద్యమిస్తామని రావుసుబ్రహ్మణ్యం తెలిపారు.

## ఘనంగా రామానుజన్ జయంతి




గుడివాడ : జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా నిర్వహించే శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకొని మున్సిపల్ పాఠశాలల్లో పనిచేసే గణిత ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. బుధవారం స్థానిక ఏజికె ఉన్నతపాఠశాలలో ఉత్తమ గణిత ఉపాధ్యాయులు శొంటి శ్రీనివాస్, కుసుకుమార్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు రాష్ట్ర కార్యదర్శి, చంద్రశేఖర్, ఏ.జి.కె ప్రధానోపాధ్యాయురాలు నరసమాంబ, షేక్ జాన్సాహెబ్, గణిత ఉపాధ్యాయులు పి.వి.సత్యనారాయణ, కె.శివనాగేశ్వరి, ప్రసన్న, చంద్రిక, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ కె ఆర్ పురం పాలకమండలి సమావేశం



కె.ఆర్. పురం (ఐటిడిఎ) ,ప్రజాపాలన ప్రతినిధి: జిల్లా కలెక్టర్, పశ్చిమ గోదావరి జిల్లా , ఐటీడీఏ ఛైర్మన్ వారి అధ్యక్షతన ది.30.12.2021 న ఐటీడీఏ కె ఆర్ పురం పాలకమండలి సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఓ. ఆనంద్ బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సమావేశంలో సంబంధించిన శాఖల ప్రగతి పై సమీక్షించడం జరుగుతుందని, ది.1.4.2016 నుండి ది.30.9.2021 వరకు మీ డిపార్ట్మెంట్కు సంబంధించిన పూర్తి వివరాలతో సమావేశానికి హాజరవ్వాలన్నారు. సంబంధించిన అధికారులు ఇ మెయిల్ ద్వారా , సాఫ్ట్ కాపీ, హార్డ్ కాపీ లను ముందస్తు పంపాలని పేర్కొన్నారు. సమావేశంలో విధిగా కోవిడ్ - 19 ప్రోటోకాల్ను అనుసరించాలని పేర్కొన్నారు.


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao
DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu
Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao
Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046
7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111

Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

# ప్రజాపాలన

సంపాదకీయం

గురువారం 23, డిసెంబరు 2021


## నిజమైన నివాళి అదే!

అది 2001, డిసెంబర్ 13. ఢిల్లీకే ప్రత్యేకించిన ఓ చలికాలపు ఉదయాన వైమానిక దళాధికారి సచివాలయంలో విధి నిర్వహణలో ఉన్నాను. ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.వై టిప్నీస్ ఆరోజు ఆఫీసులో లేరు. మా ఆఫీసు నుంచి చూస్తుంటే నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్, ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంట్ స్పష్టంగా కనిస్తున్నాయి. అది ఉత్తర భారతదేశంలో పెళ్లిళ్ల సీజన్ కాబట్టి టపాసుల శబ్దాలు వినిపించినప్పుడు ఆందో ళన చెందేవాళ్లం కాదు. ఆరోజు పార్లమెంట్ వైపు నుంచి వినిపించిన కాల్పుల శబ్దాల వంటివాటిని ముందుగా పట్టించుకోనప్పటికీ, వాటి తీవ్రత పెరిగి అవి తుపాకీ కాల్పులేనని స్పష్టమవ్వడంతో నేను వెంటనే వైస్ చీఫ్, ఎయిర్ మార్షల్ కృష్ణస్వామి ఆఫీస్‌కు వెళ్లాను. పార్లమెంట్ దగ్గర కాల్పులు జరుగుతున్నాయని చెప్పాను. అప్పటికే ఢిల్లీ పోలీస్ జీపులు సైరన్ మోతలతో పార్లమెంట్ వైపు పరుగి డుతున్నాయి. కొద్ది సేపటికే అక్కడ భ్రదతా దళాలు మోహ రించాయి. హఠాత్తుగా జరిగే ఉగ్రదాడులను ఎదుర్కోవ డంలో దేశ భద్రతా వ్యవస్థ ఎంత అప్రమత్తంగా ఉండాలో చెప్తూ చర్చను లేవనెత్తిన ఉగ్రదాడి అది. పార్లమెంట్‌పై ఉగ్రవాదుల దాడి జరిగి 20 ఏళ్లు అయిన సందర్భంగా మరోసారి మన భద్రతా సన్నద్ధతను అవలోకించవలసిన సందర్భం ఇది. అత్యంత అధునాతన ఆయుధాలు ధరించిన ఐదుగురు ఉగ్రవాదులు పార్లమెంట్‌పై దాడిచేయడానికి ఢిల్లీలో తిరు గాడుతుంటే మన నిఘా వ్యవస్థ గుర్తించలేకపోయింది. 1999లో నిఘా వ్యవస్థ పూర్తిగా విఫలమైన నేపథ్యంలో తలెత్తిన కార్గిల్ యుద్ధం జరిగిన రెండేళ్లకే ఈ దాడి జరగ టంతో విమర్శలు వెల్లువెత్తాయి. తర్వాతైనా నిఘా వ్యవస్థ మెరుగుపడిందా? ఏడేళ్ల తర్వాత 26/11 ముంబయి మారణకాండ మన నిఘా వ్యవస్థ ఏమాత్రం మెరుగుపడ లేదనే విషయాన్ని నిర్ధారించింది. ఆ తర్వాత అనేక నిఘా నివేదికలు హెచ్చరిస్తున్నప్పటికీ 40 మంది సిఆర్‌పిఎఫ్ జవా నుల మరణానికి కారణమైన 2019లో జరిగిన పుల్వామా దాడి, లడఖ్‌లో గత ఏడాది జరిగిన చైనీయుల చొరబాటు, ఈ ఏడాది జూన్‌లో జమ్మూలోని వైమానిక కేంద్రంపై జరి గిన దాడి వంటివాటిని ఎందుకు గుర్తించలేకపోయినట్లు? అలాగే 2016లో యూరీలో చోటుచేసుకున్న మరణాలు, పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌లోకి జరిగిన చొరబాటును మనం మర్చిపోయామా? ఐబీ, రా, ఎన్‌టీఆర్‌ఓ, డీఐఏ,ఎన్ఐఏ వంటి కేంద్ర సంస్థలు, అనేక రాష్ట్ర నిఘా సంస్థలు ఉన్నాయి. వీటికి జవాబుదారీతనం ఉండాలి. అలాగే నిఘా వ్యవస్థల నిర్మాణాలనూ సమీక్షించాల్సిన అవసరమూ ఉంది. నిఘా వందశాతం విజయం సాధించలేకపోవచ్చు. కానీ జరిగిన సంఘటనను ఫాలో అప్ చేయవలసిన అవ సరం అయితే ఉంది కదా. 2008 నవంబర్ 26న ముంబయే కాక మొత్తం దేశం నాలుగు రోజులపాటు స్తంభించి పోయింది. యూరి లేదా పుల్వామా దాడుల వంటివి జరిగిన తర్వాత ప్రతిసారి సరిహద్దులు దాటి మనం దాడిచేయడం సాధ్యం కాదు. అటువంటి దాడుల ప్రభావం కొద్దికాలం మాత్రమే ఉంటుంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పెరిగిన అంచనాలను బట్టి ప్రత్యర్థి ప్రతీకారానికి సిద్ధంగా ఉంటాడు. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలి?ముందు రాజకీయ వ్యాఖ్యల తీవ్రత తగ్గించాలి. నిధులను తగినంతగా కేటాయించాలి. శిక్షణ కార్యక్రమా లను పునరుద్ధరించడం ప్రయోజనకరం. ఈ విషయంలో స్థిరమైన ఉగ్రవాద విధానాన్ని అనుసరిస్తున్న ఇజ్రాయెల్ నుంచి నేర్చుకోవలసింది చాలా ఉంది. అద్భుతమైన సమాచార సేకరణ యంత్రాంగం, సోషల్ మీడియాపై నిఘా, అవసరమైనప్పుడు మెరుపు బాంబుదాడులకు దిగటం వంటివాటిని మనమూ గమనించాలి. ఆపరేషన్ పరాక్రమ్ వంటి అరకొర సైనిక చర్యలను నివారించాలి. 10 నెలలపాటు పది లక్షల మంది ఆధునిక సైనికులను అప్రమత్తం చేసి యుద్ధ సన్నాహాలు చేయడం వల్ల, ఇండియా యుద్ధం చేయకుండానే 1874 మంది సైనికులను కోల్పోయింది. అలాగే కోట్లాది రూపాయల ధనం వ్యర్థమయింది. ఈ సైనిక చర్యల వల్ల ఏమైనా ఉగ్రవాద చర్యలు తగ్గాయా? స్పష్టమైన రాజకీయ వ్యూహం లేకపోతే ఇవి కొనసాగుతూనే ఉంటాయి. ఇక చివరగా గమనించాల్సిందేమిటంటే.. మన శత్రు వులు మన ప్రతికూలతను అనుకూలంగా మార్చుకుంటున్న సంగతిని గుర్తించడం. మన ప్రభుత్వం అనేక భద్రతా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, దానితోపాటు సామాజిక చైతన్యాన్ని కూడా రేకెత్తించవలసి ఉంది. మావో గెరిల్లా యుద్ధ తంత్రాన్ని 'సముద్రంలో ఈదే చేప' అని వ్యాఖ్యా నించాడు. ప్రభుత్వం సముద్రంలాంటి ప్రజల్లో ఉగ్ర వాదం అనే చేపకు మద్దతు దొరకకుండా నిరోధించగలగాలి. ఈ చర్యలన్నీ చేపడితే దేశ విభజన కోసం కుయుక్తులు పన్నే శక్తులను అణచివేయడం సాధ్యమవుతుంది. ఇదే పార్ల మెంట్‌పై జరిగిన దాడిలో మరణించిన మన యోధులకు అర్పించే నిజమైన నివాళి అవుతుంది.

# మన వ్యక్తిగత సమాచారంతో వ్యాపారం



వ్యక్తుల సమాచారం గోప్యంగా ఉంచుకునే హక్కు ప్రాథమిక హక్కు అని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. ఏ పౌరుని వ్యక్తిగత డేటానైనా తెలుసుకోవాలంటే అందుకు చట్టపరమైన ముందస్తు అనుమతి తప్పనిసరి అని కూడా సుప్రీం కోర్టు చెప్పింది. కాని మోడీ ప్రభుత్వం పౌరుల వ్యక్తిగత డిజిటల్ గుర్తింపు (ఆధార్, పాన్ నెంబర్ వంటివి) తప్పనిసరిగా అనుసంధానం చేస్తేనే వివిధ ప్రభుత్వ సేవలు గాని, ప్రభుత్వ రంగ సంస్థల సేవలు కాని అందుతాయని షరతులు విధించింది. ఆ విధంగా పౌరుల నుండి సేకరించిన వ్యక్తిగత సమాచారాన్ని ప్రైవేటు వ్యాపారులకు అందజేసి తద్వారా వాళ్ళ వ్యాపారాన్ని విస్తరించుకోడానికి తోడ్పడుతోంది. గతంలో ఎన్నడూ లేనంతగా నేడు సంబంధాలు పెరిగి మనుషులు దగ్గరౌతున్నారు. ప్రపంచ జనాభాలో 60 శాతం ఇంటర్నెట్‌తో కనెక్ట్ అయివున్నారు. స్మార్ట్‌ఫోన్లు చౌకగా లభించడం, నెట్‌వర్క్ ఉన్న ప్రాంతాల విస్తీర్ణం పెరగడంతో మన దేశంలో 70 శాతం ఇంటర్నెట్‌తో కనెక్ట్ అయివున్నారు. మనలో చాలామంది ఇంటర్నెట్ తో కనెక్ట్ అయివున్నాం అనుకుంటున్నా, నిజానికి ఎక్కువమంది కనెక్ట్ అయివున్నది గూగుల్ తో గాని ఫేస్‌బుక్ తో గాని మాత్రమే. ఈ రెండు డిజిటల్ సంస్థలే గుత్తాధిపత్యం చలాయిస్తున్నాయి. తన స్వంత ఇంటర్నెట్ తో మన దేశంలో ప్రజలందరినీ అనుసంధానం చేసి పట్టుబిగించాలని ఫేస్‌బుక్ 'ఫ్రీ బేసిక్స్' అనే ఒక మరుగుజ్జ నెట్‌వర్క్‌ను మనకి అంటగట్టడానికి ప్రయత్నించింది. ఐతే, ప్రజల సమిష్టి ప్రతిఘటనతో వెనక్కి తగ్గక తప్పలేదు. ఐతే వేరే 65 దేశాలలో ఫేస్‌బుక్ తన ఫ్రీ బేసిక్స్ ను ప్రవేశపెట్టడంలో జయప్రదం కాగలిగింది. ఇది విచారకరం. ఆ నెట్‌వర్క్‌ను ఉపయోగించేవారంతా ఫేస్‌బుక్ అంటేనే ఇంటర్నెట్ అనే భ్రమలో ఉన్నారు. వాడకందారులను ఆకట్టుకుని వారికి సంబంధించిన సమాచారాన్ని సేకరించడంలో గూగుల్ కి, ఫేస్‌బుక్‌కి ఉన్న సామర్థ్యం వల్లనే ఆ రెండు సంస్థలూ వాణిజ్య ప్రకటనల ప్రపంచంలో ఆధిపత్యాన్ని కలిగివున్నాయి. టి.వి, ప్రింట్, రేడియో మాధ్యమాలన్నీ కలుపుకున్నా రానంత యాడ్ ఆదాయం ఒక్క డిజిటల్ రంగమే సంపాదించగలుగుతోంది. ఇందులో గూగుల్, ఫేస్‌బుక్–ఈ రెండే గుత్తాధిపత్యం కలిగివున్నాయి. యాడ్ ఆదాయం మీద ఆధారపడి నడిచే తక్కిన మీడియా ప్రపంచానికి ఇది ప్రమాదకరంగా తయారైంది. అందుకే అమెరికాలో, బ్రిటన్‌లో, యూరోపియన్ యూనియన్ దేశాల్లో గూగుల్, ఫేస్‌బుక్ ల గుత్తాధిపత్యాన్ని బద్దలుచేసేలా నియంత్రణ, చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఐతే భారతదేశంలో మాత్రం మోడీ ప్రభుత్వం ఈ రెండు సంస్థల ఆధిపత్యాన్ని ఎదిరించడానికి సుముఖంగా లేదు. ఈ మధ్య సోఫీ జాంగ్, ఫ్రాన్సెస్ హాజెన్ అనే ఫేస్‌బుక్ మాజీ ఉద్యోగులు ఈ రెండు గుత్త సంస్థలూ మనదేశంలో పాలక పార్టీల కొమ్ము కాస్తూ మైనారిటీలకు, ఇతరులకు వ్యతిరేకంగా ప్రమాదకరమైన విద్వేషపూరిత ప్రచారాన్ని సాగించిన వైనాలను బహిర్గతం చేశారు. మన ప్రభుత్వం అమెరికాతో అంటకాగే విధానం పాటిస్తున్నందు వల్లను, ఈ సంస్థలు తమకు అనుకూలంగా పోషిస్తున్న పాత్ర వలన కూడా మోడీ వాటి పట్ల మెతకగా, సానుకూలంగా వ్యవహరిస్తున్నారు. దీనితోబాటు, ప్రభుత్వం దేశ పౌరుల నుండి సేకరించిన వ్యక్తిగత డేటాను వ్యాపార ప్రయోజనాల కోసం వినియోగించడానికి దోహదం చేసే వ్యవస్థలను రూపొందించడానికి పూనుకుంటోంది. దేశ పౌరులకు సంబంధించిన సమాచారం ప్రభుత్వం సేకరిస్తుంది (జనాభా లెక్కల సేకరణ వంటి చర్యల ద్వారా). ఆ సమాచారాన్ని ప్రభుత్వానికి తెలియజేయడం పౌరులుగా మన బాధ్యత. దానితోబాటు సంక్షేమ పథకాలను అమలు చేయడానికి గాను కొంత సమాచారాన్ని ప్రభుత్వం సేకరిస్తుంది. ఈ సమాచారాన్ని వ్యాపార ప్రయోజనాల కోసం వాడుకోవడానికి వీలు కల్పించేలా ప్రభుత్వం డేటా రక్షణ చట్టాన్ని రూపొందించింది. వ్యక్తుల సమాచారం గోప్యంగా ఉంచుకునే హక్కు ప్రాథమిక హక్కు అని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. ఏ పౌరుని వ్యక్తిగత డేటానైనా తెలుసుకోవాలంటే అందుకు చట్టపరమైన ముందస్తు అనుమతి తప్పనిసరి అని కూడా సుప్రీం కోర్టు చెప్పింది. కాని మోడీ ప్రభుత్వం పౌరుల వ్యక్తిగత డిజిటల్ గుర్తింపు (ఆధార్, పాన్ నెంబర్ వంటివి) తప్పనిసరిగా అనుసంధానం చేస్తేనే వివిధ ప్రభుత్వ సేవలు గాని, ప్రభుత్వ రంగ సంస్థల సేవలు కాని అందుతాయని షరతులు విధించింది. ఆ విధంగా పౌరుల నుండి సేకరించిన వ్యక్తిగత సమాచారాన్ని ప్రైవేటు వ్యాపారులకు అందజేసి తద్వారా వాళ్ళ వ్యాపారాన్ని విస్తరించుకోడానికి తోడ్పడుతోంది. ఇప్పటికే టెలికాం కంపెనీల, బ్యాంకుల సేవలు పొందాలంటే ఆధార్ ఏవిధంగా తప్పనిసరి అయిపోయిందో మనం చూస్తున్నాం. ఆ సమాచారం బడా వ్యాపార సంస్థలకు అందుబాటులోకి వచ్చింది. ప్రయాణాలకు ఆరోగ్యసేతు యాప్‌ను, హెల్త్ ఐ.డి ని తప్పనిసరి చేశారు. ఆ విధంగా వచ్చే సమాచారాన్ని ఇన్సూరెన్స్ సంస్థలు, కార్పొరేట్ వైద్య సంస్థలు తమ వ్యాపారం కోసం వినియోగించుకోగలుగుతాయి. వ్యాక్సినేషన్ కోసం మనం గనుక 'కో–విన్' యాప్ ను వాడివున్నట్టయితే మన ఆమోదంతో నిమిత్తం లేకుండానే మనకొక హెల్త్ ఐ.డి కేటాయించి వుంటారు. ఇప్పటికే దాని ద్వారా మన సమాచారం ఇన్సూరెన్స్ కంపెనీలకు, కార్పొరేట్ ఆస్పత్రులకు చేరిపోయి వుంటుంది. ఆధార్ కార్డు ఇవ్వడం కోసం మనవద్దనుండి ఏవిధంగా సమాచారం సేకరించారో, అదే విధంగా ఇతర సందర్భాలలోనూ సేకరిస్తూ దానిని ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వం అందజేస్తోంది. ఉదాహరణకు, ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలు మన అనుమతి లేకుండానే మన ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి దాని ఆధారంగా మనకు ఇన్సూరెన్స్ డబ్బుల్ని ఎగనామం పెట్టొచ్చు. అలా ఎగ్గొట్టడానికి ఆ ఇన్సూరెన్స్ పాలసీలో రాసివున్న (మనకు అర్థంకాని, లేదా మనకు ముందుగా వివరించని) నిబంధనలను సాకుగా చూపుతారు. మన ఆరోగ్య పరిస్థితిని కారణంగా చూపించి మన ఉద్యోగాలకు యజమాని ఎసరు పెట్టవచ్చు. ఈ విధమైన వ్యాపార ప్రయోజనాలకు మన డేటాను వాడుకోడాన్ని చట్టబద్ధం చేయడమే గాక ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే నేర పరిశోధనా సంస్థలు కూడా మన వ్యక్తిగత సమాచారాన్ని మనకు తెలియకుండా ఉపయోగించుకోడానికి వీలు కల్పిస్తోంది మోడీ ప్రభుత్వం రూపొందించిన డేటా బిల్లు. అత్యయిక పరిస్థితి విధించిన కాలంలో 'మీసా' చట్టం అమలులో ఉండేది. ఆ చట్టం కింద నిర్బంధించబడినవారి ఉనికిని తెలియజేయాలని కోర్టుల్లో హెబియస్ కార్పస్ పిటిషన్లు దాఖలు చేశారు. వాటికి వ్యతిరేకంగా వాదిస్తూ నిరేన్ డే అనే ప్రభుత్వ లాయరు అత్యయిక పరిస్థితుల్లో పౌరులకు జీవించే హక్కు ఉండదని చెప్పారు. ఇప్పుడు ఆ విషయం గుర్తుకొస్తోంది. పౌరులకు వ్యక్తిగత గోప్యత హక్కు ఉంటుంది కాని ప్రభుత్వ పరిశోధనా సంస్థల నుండి సమాచారాన్ని గోప్యంగా ఉంచే హక్కు ఉండదన్నమాట. మన డేటాను ఏవిధంగా దుర్వినియోగం చేయవచ్చో తెలియజేసే ఒక ఉదాహరణ ఇది: సమాచార హక్కుద్వారా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. జమ్ము, కాశ్మీర్ లోని కుల్గాం లో చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆరోగ్యసేతు లో తన వద్ద ఉన్న పౌరుల సమాచారాన్ని స్థానిక పోలీసులకు అందజేశాడు. ఆ పౌరులపై పోలీసుల నిఘా ముమ్మరం చేయడానికి ఆ సమాచారం తోడ్పడింది. ఈ విధంగా మనకు తెలియకుండా మన వ్యక్తిగత జీవితం మీద ఒక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయడానికి మనం ఇచ్చిన డేటానే వినియోగించడానికి ప్రభుత్వానికి అధికారం ఉందా ? ప్రస్తుతం ఉన్న డిజిటల్ నిఘా వ్యవస్థ పరిధిలోనే మనకు సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడానికి ప్రభుత్వ పరిశోధనా ఏజన్సీలకు అవకాశాలు ఉన్నాయి. సెంట్రల్ మానిటరింగ్ సిస్టమ్ ఫర్ టెలికాం సర్వైలెన్స్, ఇంటర్నెట్ నిఘా కోసం 'నెట్రా', జాతీయ నిఘా సమాచార వ్యవస్థ గ్రిడ్ (నాట్‌గ్రిడ్), నేషనల్ గ్రిడ్ ఆఫ్ సర్వైలెన్స్ డేటా బేసెస్ అండ్ ఇంటిగ్రేటెడ్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ (ఐసిజెఎస్) – ఇందులో డిఎన్ ఎ, ఫేషియల్ రికగ్నిషన్, బయోమెట్రిక్స్, పుట్టుమచ్చలు, తదితర వ్యక్తిగత గుర్తులు కూడా ఉన్నాయి. ఇవన్నీ చట్టపరంగానే మన అనుమతి లేకుండా మన వ్యక్తిగత సమాచారాన్ని ఉపయోగించవచ్చు. ఇజ్రాయిల్ దేశపు నిఘా వ్యవస్థ ఎన్ఎస్ఓ సైనికావసరాల నిమిత్తం ఉపయోగించే గూఢచర్యపు సాధనాలను రూపొందించింది. దానిని మన ప్రభుత్వం ఉపయోగించి వాటి ద్వారా చట్టవిరుద్ధంగా మన మొబైల్ ఫోన్లను హ్యాక్ చేస్తోంది. పాత్రికేయులు, ప్రజా జీవితంలో ప్రముఖులు, ప్రతిపక్ష నేతలు, ఆఖరుకు న్యాయమూర్తులను సైతం విడిచిపెట్టడం లేదు. ఈ విధంగా హ్యాక్ అయిన ఫోన్ నంబర్ల వివరాలను ఒక హెబియస్ కార్పస్ పిటిషన్ విచారించే సందర్భంలో సుప్రీం కోర్టుకు నివేదించడం జరిగింది కూడా. ఐతే అందుకు సంబంధించి ఏ వివరాలనూ సుప్రీం కోర్టుకు తెలియజేయడానికి ప్రభుత్వం నిరాకరించింది. అలా నిరాకరించడం ద్వారా నిఘా సంస్థలు పౌరుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తున్నాయని ప్రభుత్వమే అంగీకరించినట్టైంది. గతంలో నిరేన్ డే ప్రకటించిన వైఖరినే ఇప్పుడు మోడీ ప్రభుత్వం తీసుకుంది. ఉద్యోగుల కార్యకలాపాలను మానిటర్ చేసే యాప్‌లను ఆ ఉద్యోగుల ఫోన్లలో ఇన్‌స్టాల్ చేయాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. హర్యానాలో అంగన్వాడీ ఉద్యోగులు ఎప్పుడు ఎక్కడెక్కడ ఉంటారో సూచించే యాప్ ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని అక్కడి ప్రభుత్వం ఆదేశించింది. పాంచ్‌కులా లో మునిసిపల్ వర్కర్ల ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవలసిన యాప్ వారి కదలికలనే గాక వారి మాటలను సైతం రికార్డు చేస్తుంది. ఇవన్నీ ఆ కార్మికుల, ఉద్యోగుల వ్యక్తిగత గోప్యతకు భంగకరమే. ఆ విధంగా ప్రభుత్వ సంస్థలు వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించేలా వ్యవహరించే అధికారాన్ని ఇవ్వడం ద్వారా మోడీ ప్రభుత్వం కార్మికుల గోప్యతకు భంగం కలిగించడమే గాక వారి భద్రతకు సైతం ముప్పు తెచ్చిపెడుతున్నది. పుత్తుస్వామి కేసులో సుప్రీం కోర్టు వ్యక్తిగత గోప్యత పౌరుల ప్రాథమిక హక్కు అని తీర్పునిచ్చింది. ప్రభుత్వం అతిగా వ్యవహరించి వ్యక్తుల గోప్యతకు భంగం కలిగించకుండా ఏవిధంగా చట్టబద్ధంగా కట్టడి చేయాలో శ్రీకృష్ణ కమిటీ నివేదిక విశదం చేసింది. అంతేగాక వ్యక్తుల డేటా పొందిన ప్రైవేటు సంస్థలు ఆ డేటాను ఏయే పరిమితులకు లోబడి ఉపయోగించాలో ఆ పరిధులను కూడా ఆ కమిషన్ రూపొందించింది. 2019లో ప్రభుత్వం వ్యక్తిగత సమాచార గోప్యత పరిరక్షణ బిల్లును తెచ్చింది. ఇప్పుడు అది జాయింట్ పార్లమెంటరీ కమిటీ ముందు తుది రూపు తీసుకుంటోంది. ఈ బిల్లు పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా పరిరక్షించే విషయంలో మాత్రం ఘోరంగా విఫలమైంది. ఆ సమాచారాన్ని ప్రభుత్వ నిఘా ఏజన్సీలు గాని, ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు గాని దుర్వినియోగం చేయడాన్ని కూడా ఈ బిల్లు నిరోధించలేదు. జస్టిస్ శ్రీకృష్ణ తో సహా పలువురు న్యాయ నిపుణులు ఈ బిల్లులో ప్రభుత్వానికి కల్పించిన విస్తృత అధికారాలను తప్పు పడుతున్నారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీలోని సభ్యులు సైతం ఈ విషయంలో తమ వ్యతిరేకతను ప్రకటించారు. ఇటువంటి అడ్డూ, ఆపూ లేని అధికారాలను కల్పించడం వలన పౌరుల వ్యక్తిగత సమాచారగోప్యత అపహాస్యం పాలౌతుంది. ప్రభుత్వ సంస్థల నిఘా తీరుతెన్నులను న్యాయ వ్యవస్థ ద్వారా కాని, పార్లమెంటు ద్వారా కాని సమీక్షించే ఏర్పాటు ఏదీ ఈ బిల్లులో ప్రతిపాదించలేదు. తాము ప్రతిపాదించిన నిబంధనలను వేటినీ ఈ బిల్లు పరిగణనలోకి తీసుకోలేదని జస్టిస్ శ్రీకృష్ణ ప్రకటించారు. ఈ బిల్లు గనుక ఆమోదం పొందితే మన రాజ్యం ఒక నియంతృత్వ రాజ్యంగా దిగజారుతుందని ఆయన ప్రకటించారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ లోని ప్రతిపక్ష సభ్యులు ఇప్పటికే ఈ బిల్లులోని ప్రతికూల అంశాలపై తమ అభ్యంతరాలను వెల్లడి చేశారు. ఇక అభ్యంతర పెట్టవలసినది ఈ దేశంలో ఉన్న ప్రజాస్వామిక వాదులే. ఒక నిఘా రాజ్యాన్ని ఏర్పాటు చేసి మన వ్యక్తిగత గోప్యతకు ఎసరు పెడుతున్న ఈ బిల్లును ప్రతిఘటించడానికి అధిక సంఖ్యలో ప్రజాస్వామిక శక్తులన్నీ కదలాలి.

## అభావం

మిద్దె పైన గులాబి మొక్క
చిన్న మొలక నుంచి
చిగురాకులేసి ఎదిగింది
లేలేత మొగ్గలేసింది
పరిమళాల పూలు పూసింది
విరిసిన గులాబీలు వాడిపోయినట్టే
ఉన్నట్టుండి పత్రాలూ పండిపోయాయి!
చెట్టు ఆకులన్నీ రాల్చుకుంది
చివరకు మోడై మిగిలింది
ముచ్చటైన రెమ్మల్ని
విచ్చుకున్న సుమాల్ని
నిక్షిప్తం చేసుకున్న కెమెరా కన్ను
దిగులుతో ముడుచుకుపోయింది!
కొన్ని రాత్రుళ్లు గడిచాక ఓ సూర్యోదయం
ఎండిన కొమ్మపై చిరునవ్వులొలికిస్తూ
ఎర్రెర్రని లేచివుళ్లు!
ఆపైన ముద్దులొలికే పసిమొగ్గలు
ఎదగటానికి తనకు తాను
ఎంతగా గాయం చేసుకుంది?
ఎన్నెన్ని వదిలించుకుంది!
అప్పుడే అనిపించింది
పనికిరాని పాతను పాతరేసి
మళ్లీ కొత్తగా పుట్టాలని!

..ల

## మాట్లాడు

మాట్లాడు, నీ మాటలింకా నీవే
నీ పెదాలింకా స్వేచ్ఛగానే ఉన్నాయి
నిటారుగా నిలబడ్డ దేహమింకా నీదే
నువ్వింకా సజీవంగానే ఉన్నావు.
చూడుజి
కొలిమిలో మంటలు ఎగసి పడుతున్నాయి
ఇనుము ఎర్రెర్రగా కరుగుతున్నది
తాళాలు తెగిపడుతున్నాయి
సంకెళ్లు విరిగిపోతున్నాయి
విను.
ఇప్పటికింకా సమయం మించి పోలేదు
మాట్లాడుజి



శరీరమూ నాలుకా పడిపోకముందే
మాట్లాడుజి
నిజం ఇంకా నిలిచి ఉన్నది
మాట్లాడుజి
మాట్లాడవలసిందంతా మాట్లాడు.

## గర్భిణి స్త్రీలకు నగదు అందజేత



గుడివాడ : దేవాదాయ ధర్మాదాయ శాఖ, అహింస సాంప్రదాయ సేవ హాస్పిటల్‌ల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బడుగు బలహీన వర్గాలకు చెందిన గర్భిణీ స్త్రీలకు వైయస్సార్ సి పి అధికార ప్రతినిధి దుక్కిపాటి శశిభూషణ్, పట్టణ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ ఇందిరాదేవి చేతుల మీదుగా వెయ్యి రూపాయల పారితోషికాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మాదాసు వెంకటలక్ష్మి, జ్యోతుల సత్యవేణి, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు సురేష్‌బాబు, షణ్ముఖం, ఐసిడిఎస్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీలక్ష్మీగణపతి హోమం



గుడివాడ : స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానములో శ్రావణ మాసం బహుళ చవితి బుధవారం సంకష్ట హర చతుర్థి పురస్కరించుకున్ని దేవాలయ ప్రాంగణములో శ్రీలక్ష్మిగణపతి హోమం నిర్వహించారు. శ్రీలక్ష్మిగణపతి హోమంలో 40 మంది దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన మేనేజర్ వి.ప్రసాద్ భక్తులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులను ఉన్నపలంగా ఖాళీచేయమనడం దారుణం: జనసేన నాయకులు బూరగడ్డ



గుడివాడ : రోడ్లపై వ్యాపారాలను నిర్వహిస్తు కుటుంబానికి అసరాగ ఉన్న చిరువావ్యారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఖాళీ చేయమనడం దారుణమాని జనసేన గుడివాడ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్ అవేదన వ్యక్తం చేశారు. బుధవారం మున్సిపల్ అధికారులు స్థానిక చేపల మార్కెట్ రోడ్ సమీపంలో వ్యాపారలను తొలగించాలని ఒత్తిడి తీసుకురావడం జరిగింది. ఈ విషయమై జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్ వ్యాపారస్థులకు అండగా నిలిచి తొలగింపును అండుకోన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా రోడ్లపై చినచిన్న తోపుడు బండ్లపై వ్యాపారం చేస్తున్న వారిని ఉన్నపలంగా ఖాళీ చేయలని డిమాండ్ చేయడం దారుణమన్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ పి.జె సంపత్‌కుమార్‌ను కలసి వ్యాపారుస్తులకు ప్రయత్నయంగా వేరే చోట్ల వ్యాపారుం నిర్వహించేందుకు అనుమతులు ఇచ్చిన తర్వతే వీటిని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొదమల గంగాధరరావు, నాయకులు వేమూరి త్రినాథ్, సాయిపవన్, వెంకటేష్, రాజా, అజయ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## హింసాత్మక రాజకీయాలు సరికాదు: బిజెపి మైనారిటీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షులు షేక్. ఖలీఫాతుల్లాబాషా



ఒంగోలు : హింసాత్మక రాజకీయాలు సరికాదని, సుబ్బారావు గుప్తాపై జరిగిన దాడిని, బీజేపీ ఖండిస్తుందని బిజెపి మైనారిటీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షులు షేక్. ఖలీఫాతుల్లాబాషా అన్నారు. ఒంగోలు నగరానికి చెందిన ఆర్యవైశ్య సోదరుడు సుబ్బారావు గుప్తా పై, వైసీపీ పార్టీ కే చెందిన నాయకుడు సుభాని, అతనిఅనుచరులు వికృత చేష్టలతో చేసిన దాడిని, బీజేపీ త్రివంగా ఖండిస్తుందన్నారు. సుబ్బారావు గుప్తా నివాసానికి వెళ్లి, ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ, ఈసంఘటన ఆర్యవైశ్య కులస్థులనే కాదు,హింసారహిత రాజకీయాలను కోరుకునే, వారందరి మనోభావాల్ని దెబ్బతీసిందన్నారు. ఆరోగ్యముగాఉన్న సుబ్బారావుగుప్తా, మానసికపరిస్థితి బాగాలేదని, వైసీపీ నేతలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇలా పార్టీ లోని వారిపై, పార్టీ వారే దాడికి పాల్పడటం, ఎంత వరకు సమంజసం,అని,ఇది సబబేనా అంటూప్రశ్నించారు .భయభ్రాంతులకు గురైన సుబ్బారావు గుప్తా ,భార్య పిల్లలు, తమకు ప్రాణహానిఉందని, దాడిచేసిన వారి నుంచి తమను రక్షించాలని రోధించారు. బీజేపీ జాతీయనాయకులు,రాజ్యసభ సభ్యులు జీవియల్ నరసింహారావు,ఈ సంఘటనను ఖండిస్తూ, సుబ్బారావు గుప్తా తో,ఫోన్లో మాట్లాడి, అండగా ఉంటామని, భరోసా ఇచ్చి ధైర్యం చెప్పారు. దోషులను కఠినంగా శిక్షించాలని, డిజిపితో మాట్లాడతామని, అవసరమైతే కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్తామని,పూర్తిన్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సుబ్బారావు గుప్తా పై దాడి చేసిన,వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేసి, సుబ్బారావు గుప్తా కుటుంబానికి రక్షణా కల్పించాలని, జిల్లా ఎస్పీని,ఖలీఫాతుల్లా భాషా కోరారు.

# సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలి: మంత్రి తానేటి వనిత



కొవ్వూరు,ప్రజాపాలన ప్రతినిధి : ప్రజలకు, లబ్ధిదారులకి అందుబాటులో ఉండి సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి తానేటి వనిత ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయ సమావేశ మందిరంలో కొవ్వూరు మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశానికి ఎంపిపి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి వొచ్చే వారి విషయంలో రేపు అనే మాట ఏ ఒక్కరి నోటా రాకూడదన్నారు. ఈరోజు పరిష్కారం కానీ సమస్యకు రేపు ఏ విధంగా పరిష్కారం లభిస్తుంది అనే ఆలోచన కలిగి, లబ్ధిదారుల తరపున ఆలోచన చేయాలన్నారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని, ఈ విషయంలో ప్రజా ప్రతినిధులతో కలసి వెళ్లాలన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లడం, ఆయా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధుల సమక్షంలో అందించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. మండల పరిధిలో చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరాలు ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులకు తెలియచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మండలాన్ని అన్నీ రంగాల్లో ఆదర్శంగా నిలిపేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం చేసుకోవడం ముఖ్య మని తెలిపారు. పి. పి. కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) మాట్లాడుతూ, కొవ్వూరు మండలంలో 9359 మందికి వైఎస్సార్ పెన్షన్ కానుక కింద సుమారు రూ. 2.16 కోట్లు ప్రతినెలా అందిస్తున్నామన్నారు. వీరిలో ఓఏపి .. 4840, వితంతు ..2495, దివ్యాంగులు 1005, ఒంటరి మహిళ లు 425, అభయహస్తం. 330, కల్లుగీత , చేనేత, తదితరులు ఉన్నారన్నారు. టైలర్లు 78 మంది, వాహన మిత్రా 439 మంది, ఆరోగ్యశ్రీ కింద 22716 , జగనన్న విద్యా దీవెన 1463 మందికి ప్రయోజనం చేకూర్చడం జరిగిందన్నారు. అమ్మఒడి ద్వారా 7674 మందికి రూ. 12.70 కోట్లు, సున్నా వడ్డీ కింద 3723 మందికి రూ. 10.82 కోట్లు, వైఎస్సార్ చేయూత 2865 మందికి రూ . 5.37 కోట్లు, కాపునేస్తాం కింది 1478 మందికి రూ. 2 21 కోట్ల మేర ప్రయోజనం కల్పించామని ఆయన తెలిపారు. సమావేశంలో భాగంగా లబ్ధిదారులకి జగనన్న సంపూర్ణ గృహ హక్కు పత్రాలు అందచేశారు. ఈ సమావేశంలో ఎం. పి. పి. కాకర్ల సత్యనారాయణ (నారాయుడు), వైస్ యం. పి. పి. వీరమళ్ళ నారాయుడు , డి. యల్. డి. ఓ, పి. జగదాంబ, మండల తహశీల్దార్ బి. నాగ రాజు నాయక్, జెడ్. పి. టి. సి. బొంతా వెంకట లక్ష్మి, ఎంపిటిసి , నామినేటెడ్ సభ్యులు, 22 శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాలేజ్ చదువు నేర్పిస్తుంది.. హాస్టల్ జీవితాన్ని నేర్పిస్తుంది

## శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి





నరసరావుపేట. ప్రజాపాలన :నరసరావుపేట పట్టణంలోని వినుకొండ రొడ్డులో గల రెడ్డి హాస్టల్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. జగన్ కి విద్య అంటే చాలా ఇష్టమని, అందుకే ప్రభుత్వ పాఠశాలలను నాడు నేడు ద్వారా రూపరేఖలను మార్చారని అన్నారు. ఇంజినీరింగ్ లాంటి పై చదువులు చదువుతున్న వారికి విద్యాదీవెన, వసతి దీవెన అందిస్తున్నామని తెలిపారు. జగన్ విద్యపై అంతటి దృష్టి పెట్టడం వల్లే ఇవాళ ఏపీ కేరళను దాటి విద్యావరంగా నంబర్ వన్గా నిలిచిందన్నారు. విద్యపై ఎంతపెట్టినా అది పెట్టుబడి కాదని దాని ప్రతిఫలాన్ని భవిష్యత్తో చూస్తామని అన్నారు. ఫీజు రియంబర్స్ మెంట్ పథకాన్ని పెట్టి పేదల జీవితాల్లో వైఎస్ఆర్ వెలుగులు నింపారని అన్నారు. ఇవాళ రాష్ట్రంలో రెండున్నర లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారంటే అది జగన్ కృషి ఫలితమేనని పునరుద్ఘాటించారు. తాము చదువుకునే రోజుల్లో హాస్టల్స్ ఇలా ఉండేవి కాదని, చాలా కష్టాలు పడి చదువుకున్నామని తెలిపారు. హాస్టల్స్ లో స్నేహితులు ఇచ్చే నేర్పే మన జీవితాన్ని నిర్దేశిస్తుందని అన్నారు. రెడ్డి హాస్టల్ నిర్మాణంలో కీలక భూమిక పోషించిన రామిరెడ్డి , ఆళ్ల అయోధ్య రామి రెడ్డి , విక్నన్ ల్యాబ్ వెంకట రెడ్డి సేవలను గుర్తు చేసుకున్నారు. ఒక్కొక్కరు రూ. 50 లక్షల పై చిలుకు హాస్టల్ నిర్మాణానికి సాయం చేశారని చెప్పారు. క్యాంపస్ ప్లేస్ మెంట్లో ఉద్యోగం సంపాదించిన నాగాంజి లాంటి వాళ్లను చూస్తే తృప్తిగా ఉంటుందన్నారు. కాలేజ్ చదువు నేర్పిస్తుంది. హాస్టల్ జీవితాన్ని నేర్పిస్తుందని ఎమ్మెల్యే గోపిరెడ్డి అన్నారు. విభిన్న మనస్తత్వం కలిగిన వారి మధ్య మెలగడం ద్వారా సర్దుకుపోయే గుణంతో పాటు, పరిశుభ్రత లాంటి అనేక గుణాలు అలవడతాయని చెప్పారు. హాస్టల్ పరంగా కమిటీలు ఏర్పాటు చేసుకుని విద్యార్థులు కూడా అందులో భాగస్వాములు కావాలన్నారు. మెస్ కమిటి, మెయిన్టేనేన్స్ కమిటి, స్పోర్ట్స్ కమిటి ఏర్పాటు చేసుకుని ఐకమత్యంగా ముందుకు సాగాలన్నారు. హాస్టల్ ప్రాంగణంలో షటిల్ కోర్ట్, వాలీబాల్ కోర్ట్ ల ఏర్పాటుకు సహకరిస్తానని తెలిపారు.

హాస్టల్ లో ఉండి చదువుకుంటూ మంచి ప్రతిభ కనబరిచిన ఐదుగురుకి ఏటా రూ. 5 వేలు చొప్పున రూ25.000 ప్రోత్సాహకం రూపంలో అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పేద విద్యార్థులకు పిచ్చల శ్రీనివాసరెడ్డి(%బం%) రూ. 40 వేలు ఆర్థిక సాయం చేశారు. హాస్టల్ అభివృద్ధికి తమ వంతు సాయంగా రూ. 2.5 లక్షలు అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా హాస్టల్ లోని విద్యార్థులకు ఇంజనీర్ కమలాకర్ రెడ్డి వాషింగ్ మిషన్ అందజేశారు. దిండ్లు.. పుల్లారెడ్డి , కోటి రెడ్డి అందజేయగా.., డా. చంద్ర కిరణ్ రెడ్డి పరుపుల కవర్లు అందజేశారు. పెరల్స్ శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిచ్చల శ్రీనివాసరెడ్డి(%బం%) , డా. చంద్ర కిరణ్ రెడ్డి ,రొంపిచర్ల జెడ్పీటీసీ పిల్లి ఓబుల్ రెడ్డి , ఇంజినీర్ కమలాకర్ రెడ్డి , దొడ్డేటి అచ్చిరెడ్డి , పొలిమేర వెంకట రెడ్డి , తాళ్ల కోటిరెడ్డి , ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## క్రీస్తు సందేశం ఆచరణీయం, క్రీస్తు బోధనలు అనుసరణీయం: ప్రముఖ హార్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ ఐ.బాబూరావు

**జాయ్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో, ఘనంగా సెమి క్రిస్టమస్ వేడుకలు**

**డాక్టర్ బాబూరావు దంపతుల, సామాజిక సేవా దృక్పథం అభినందనీయం**



చీరాల(ఒంగోలు) : క్రీస్తు సందేశం ఆచరణీయమని, క్రీస్తు బోధనలు అనుసరణీయమని, అంబేద్కర్ ఐడియాలజీ ఫోరం చైర్మన్, ప్రేమ హార్ట్ హాస్పిటల్ అధినేత, డాక్టర్ ఐ.బాబూరావు అన్నారు. జాయ్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో, జె.జె.పేటలో సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు డాక్టర్ బాబురావు ఆర్థిక సహకారంతో, 250మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.



కేక్ కట్ చేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు అందరికీ తెలియజేశారు. క్షణం తీరిక లేకుండా, ఎల్లవేళలా బిజీగా ఉండే , ప్రముఖ హార్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ ఐ.బాబూరావు,సామాజిక సేవా కార్యక్రమాలలో మాత్రం, తమ సమయాన్ని కేటాయించడం, డాక్టర్ బాబు రావుతో పాటు, ఆయన సతీమణి సుభాషిణి ల, సామాజిక సేవా దృక్పథం ప్రశంసనీయమని, పలువురు వక్తలు అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్.బాబురావు, సుభాషిణి దంపతులను, క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఐ.బాబురావు, ఐ. సుభాషిణి, పాస్టర్ చంద్రకాంత్ క్లబ్ సభ్యులు రవి కుమార్, ఇన్నయ్య, బుజ్జిబాబు స్థానికులు పాల్గొన్నారు.

## అంగన్ వాడి వర్కర్లు,టీచర్లకు నియామక పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే



చీరాల(ఒంగోలు) : చీరాల నియోజకవర్గంలో పలు గ్రామ పంచాయతీలకు సంబంధించి, నూతనంగా నియమించబడిన అంగన్ వాడి వర్కర్లు,టీచర్లకు నియామక పత్రాలను, చీరాల నియోజకవర్గ శాసనసభ్యులు కరణం బలరామకృష్ణ మూర్తి అందజేశారు. ఆ కార్యక్రమంలో భాగంగా, చీరాల నగర్ (పాతచీరాల) గ్రామపంచాయతీకి సంబంధించి, అంగన్వాడీ ఆయాగా పసుపులేటి రాజ్యలక్ష్మికి, శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి మరియు చీరాల మండల సీనియర్ నాయకులు ఆసాది అంకాల రెడ్డి ల, చేతుల మీదగా నియామక పత్రం అందజేయడం జరిగింది. కార్యక్రమంలో మాజీ మంత్రి పాలేటి రామారావు,మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, రాష్ట్ర అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, సీడీపీఓ ఉమాదేవి, ప్రాథమిక వ్యవసాయ ఛైర్మన్ బోయిన కేశవులు,అసాది అంకాల రెడ్డి,ఆర్ బి కె ఛైర్మన్ కావూరి రమణారెడ్డి,సీనియర్ నాయకులు పృథ్వి ధనుంజయ, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



## పల్ససెస్ హెల్త్ టెక్నాలజీస్‌కు, 5గురు సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసి విద్యార్థులు ఎంపిక

చీరాల(ఒంగోలు) : ప్రముఖ హెల్త్ టెక్నాలజీ కంపెని అయిన పల్ససెస్ హెల్త్ టెక్నాలజీస్ కు 5గురు సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసి,విద్యార్థులు ఎంపికైనట్లు, కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాడెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సంయుక్తముగా ఒక ప్రకటనలో తెలియజేశారు. సెయింట్ ఆన్స కాలేజ్ ఆఫ్ ఫార్మసి, చీరాల 2007లో స్థాపించబడి ఫార్మసి కౌన్సిల్ ఆఫ్ ఇండియా, వారి గుర్తింపు, ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, న్యూఢిల్లి వారి గుర్తింపు మరియు జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటి, కాకినాడ వారి గుర్తింపు ఉంది. ప్రముఖ ఫార్మసీకళాశాలలలో ఒకటిగా గుర్తింపు పొందినట్లు తెలిపారు. ఇటీవల కళాశాలలో జరిగిన పల్ససెస్ హెల్త్ టెక్నాలజీస్ వారు 2022 సం. బి.ఫార్మసి పూర్తి కాబోయే విద్యార్థులకు వర్చువల్ పద్ధతి ద్వారా నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 45మంది విద్యార్థులు జరిగిన టెక్నికల్ ఇంటర్వ్యూలో పాల్గొనగా, అందులో 15 మంది అర్హత సాధించారు. వారికి జరిగిన హెచ్ఆర్ ఇంటర్వ్యూలో 5గురు విద్యార్థులు ఎంపికైనట్లు,కళాశాల ప్రధాన అధ్యాపకులు డా.వి.వి నాగేశ్వరరావు తెలియజేశారు. బి. ఫార్మసి ఆఖరి సం. చదువుతున్న జి. ఆషా, సిహెచ్.అనూష, యస్.సుధారాణి, సి.హెచ్.స్వాతి, పి. దేవికావ్య లు ఎంపికైనట్లు తెలిపారు. ఈ ప్రాంగణఎంపికలలో ఎంపికైనవిద్యార్థినికి రు. 2.80లక్షల వార్షిక వేతనము మరియు ఇతర అలవెన్సులు లభిస్తాయని, 2022 సం.జనవరిలో చెన్నై లోని పల్ససెస్ హెల్త్ టెక్నాలజీ కంపెనీలో విధులలో చేరవలసి ఉంటుందని, కళాశాలప్రాంగణ ఎంపికల విభాగ అధికారి యన్.పూర్ణచంద్రరావు తెలిపారు. పల్ససెస్ హెల్త్ టెక్నాలజీస్ వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో, ఎంపికైన విద్యార్థులకు వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

# ఓ టి ఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఆర్డిఓ కార్యాలయం వద్ద ధర్నా

కావలి డిశంబర్ 22 ప్రజాపాలన ప్రతినిధి : పట్టణంలో ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వ స్థలాల లో నివాసం ఉంటున్న పేదలకు ఉచితంగా రెండు సెంట్లు పట్టాలు ఇవ్వాలని ఓ టి ఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇళ్ల స్థలాల పట్టాల సాధన కమిటీ ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రి వద్ద నుండి ప్రదర్శనగా బయలుదేరి శివాజీ బొమ్మ మీదుగా ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ ఆర్టీసీ మీదుగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకొని బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకి వినతి పత్రం అందజేశారు. ఈ ప్రదర్శనలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ జిల్లా కమిటీ సభ్యులు గోనె దయాకర్, సిపిఎం పట్టణ కార్యదర్శి పి పెంచలయ్య ,సాధన కమిటీ కన్వీనర్ పి.అమర్ కుమార్, పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా




కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ 25 30 సంవత్సరాలుగా కావలి పట్టణంలో నిరుపేదలు నివాసం ఉంటున్నారని స్థలానికి హక్కు కల్పించాలని ఎన్నో సంవత్సరాలుగా పోరాడుతున్నారని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 225 వ జీవోను తీసుకొని వచ్చింది దీని ప్రకారం పేదలందరికీ రెండు సెంట్లు పట్టాలు ఇవ్వాలని అలాగే ఓ టి ఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని వచ్చిన తరువాత పేదల దగ్గర ఓ టి ఎస్ పేరుతో డబ్బులు గుంజుతుంది అని ఇప్పటికే అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగి కరోనా మరియు వరదలతో ప్రజానీకం కష్టాలు ఎదుర్కొంటుంటే ప్రభుత్వం సహాయం అందించాల్సిన పోయి పేదల ముక్కుపిండి డబ్బులు వసూలు చేయడం చాలా దుర్మార్గమైన విషయం అని నవరత్నాల పాలన అని అధికారంలోకి వచ్చి ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న ఈ విధానాల మీద సిపిఎం పార్టీ ప్రజలకు అండగా ఉండి పోరాటాలు సాగిస్తున్నారని తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గోనె దయాకర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా పేదల తల రాతలు మారడం లేదని అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు వచ్చినప్పటినుంచి పేదలపై భారాలు మోపడం పని గా ఉన్నాయని అందుకు నిదర్శనం ఈ ఓ టి ఎస్ విధానవే అని వాగ్దానాలు చేసిన ప్రభుత్వాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలం అవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పి. పెంచలయ్య, పోరాట సాధన కమిటీ కన్వీనర్ పి.అమర్ కుమార్, సిపిఎం నాయకులు ఎన్. వెంకయ్య, వై. కృష్ణమోహన్, పెంచల నరసింహం, పోరాట కమిటీ నాయకులు వి. సుబ్రహ్మణ్యం, ఎస్ కే భాష, మేడా పద్మ, %ాఖ%. మస్తానమ్మ, %ాఖ%. జిలాని, బేగం, లక్ష్మమ్మ, పొట్లూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## జోరుగా యన్.సి.సి శిక్షణ తరగతులు

కావలి, డిసెంబర్ 22 ప్రజాపాలన ప్రతినిధి : కరోనా ప్రభావం తో కుంటు పడిన యన్ సి సి శిక్షణ తరగతులు జోరు అందుకున్నాయి. ఇప్పటి వరకు తరగతుల నిర్వహణ లో ఏర్పడిన అవరోధం తొలగిస్తూ శిక్షణా తరగతులను వేగవంతం చేసినట్లు పాత ఊరు మున్సిపల్ స్కూల్ ట్రూప్ కమాండర్ మస్తాన్ వలి తెలిపారు. జిల్లా యన్ .సి.సి అధికారి అవినాష్ ఆదేశాల మేరకు నిర్ణయించబడిన తరగతుల లక్ష్యం పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులకు అవసరమైన యూనిఫాం అంద చేసినట్లు తెలిపారు. మున్సిపల్ స్కూల్ లో యన్ సి సి ఇన్చార్జి చంద్రమోహన్ నేతృత్వంలో జరుగుతున్న శిక్షణ కు సహాయకులుగా తోకల వెంకటేశ్వర్లు, మహేష్ లు వ్యవహరిస్తున్నారు.

## తెదేపా నేతలపై అక్రమ కేసులపై నిరసన



నరసాపురం, డిసెంబర్ 22 (ప్రజాపాలన ప్రతినిధి) : నర్సాపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ నియోజకవర్గ తేదేపా ఇంచార్జ్ పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో తెదేపా నాయకులు బుధవారం సబ్ కలెక్టర్, నరసాపురం డి.ఎస్.పీలకు మెమోరాండం అందజేశారు. భారత రాజ్యాంగ ప్రకారం ప్రభుత్వం చేపట్టే ప్రజావ్యతిరేక కార్యక్రమాలపై ప్రధాన ప్రతిపక్ష హెూదాలో స్పందించే హక్కు మరియు నిరసన తెలియజేసే హక్కు తమకు ఉందని కానీ దానిని ప్రభుత్వం పోలీసు వ్యవస్థ ద్వారా అణిచివేయడం అప్రజాస్వామికమని మెమోరాండంలో పేర్కొన్నారు. గడిచిన మూడు నెలల్లో తెలుగుదేశం పార్టీ చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలపై అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి లోబడి పోలీసులు కోవిడ్ నిబంధనలను సాకుగా చూపి అక్రమ కేసులు బనాయించి పార్టీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేయడం అమానుషమని అదే సమయంలో అధికార పార్టీ నేతలు ప్రభుత్వ మరియు పార్టీ కార్యక్రమాలలో వందల సంఖ్యలో ప్రజలతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వారికి అడ్డురాని కోవిడ్ నిబంధనలు కేవలం ప్రతిపక్ష నేతలు చేపట్టే కార్యక్రమాలకు మాత్రమే వర్తిస్తాయా అని వారు లేఖలో ప్రశ్నించారు. భారత రాజ్యాంగం ప్రకారం చట్టం అందరికి సమానమని కానీ పోలీసులు ప్రతిపక్ష నేతలపై లేనిపోని సెక్షన్లతో కేసులు బనాయిస్తూ అధికార పక్షానికి చట్టం చుట్టంలా మారుస్తూ వ్యవహరిస్తున్న ద్వంద్వ విధానాన్ని తీవ్రంగా ఖండిస్తూ నిరసన తెలియజేస్తున్నామని ఇకనైనా పోలీసులు ద్వంద్వ వైఖరితో ప్రతిపక్ష నేతల గొంతునులిమే విధానాన్ని విడనాడి భవిష్యత్తులో తెదేపా నేతలపై అక్రమ కేసులు బనాయించకుండా తగుచర్యలు తీసుకోవాలని వారు లేఖలో పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో 31 వ వార్డు కౌన్సిలర్ పాలూరి బాబ్జి, పార్టీ నేతలు రాయుడు శ్రీరాములు, జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, పొన్నాల నాగబాబు, అధికారి అనంత రామారావు, కొట్టు పండు, తుమ్మలపల్లి లక్ష్మీనారాయణ, అధికారి కిరణ్, ఎండి మౌలాలి, హుస్సేన్, మల్లాడి మూర్తి, పెంద్ర శ్రీను, నక్కా ఆనంద్, సంకు భాస్కరనాయుడు, కొలచన పద్మ, తిరుమాని శశిదేవి, బోరా చిన్నాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రోజా నోరు అదుపులో పెట్టుకో: "పేట" నియోజకవర్గ తెలుగుమహిళా విభాగ నేతలు




చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)వైసీపీ నాయకురాలు, నగరి శాసనసభ్యురాలు ఆర్ కే రోజా నోరు అదుపులో ఉంచుకోవాలని నియోజకవర్గ తెలుగుమహిళా విభాగ నేతలు హెచ్చరించారు. పట్టణ ములోని బుధవారం టిడిపి కార్యాలయంలో వారు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ మానవతా దృష్టితో రాజకీయాలకు అతీతంగా నారా భువనేశ్వరి ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ప్రజలు కష్టాలు గ్రహించి వరదల్లో నష్టపోయిన వారికి సహాయం అందించారన్నారు. తిరుపతిలో జరిగిన ఈ సేవా కార్యక్రమంలో భువనేశ్వరిని అసెంబ్లీ ఘటనపై మీడియా ప్రశ్నించినా%ా% ఆమె ఎంతో హుందాగా సమాధానం చెప్పారని, ఎవరినీ నిందించలేదన్నారు. భువనేశ్వరి వ్యక్తిత్వానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. అటువంటి వ్యక్తి మీద నగరి శాసనసభ్యురాలు ఆర్ కే రోజా జగన్ రెడ్డి మెప్పు కోసం.. మంత్రిపదవి కోసం తప్పుడు మాటలు మాట్లాడుతూ ఉంటే తెలుగుమహిళలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఓట్లు వేసిన ప్రజల కష్టాల్లో ఉంటే జబర్దస్త్ లో వెకిలి నవ్వులు.. వెకిలి చేష్టలు చేస్తోందన్నారు. ఆఖరికి అసెంబ్లీలో కూడా వెకిలి చేష్టలకే సస్పెండ్ అయిన విషయం రోజా గుర్తు చేసుకోవాలని గుర్తు చేశారు. ఇంతవరకు రోజా ప్రజలకు చేసిన మేలే%శీ%టో చెప్పాలని నిలదీశారు. నగరినియోజక వర్గానికి చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలన్నారు. గుమ్మడి కాయల దొంగ అంటే రోజా భుజాలు తడుముకుంటోందన్నారు. ఎక్కడ ఏమి జరిగినా రోజా నోరేసుకొని ముందు వరుసలో వచ్చి అధికారులను కూడా వదలకుండా తిడుతుందన్నారు. టీడీపీ నేతలను, మహిళలను తప్పుడు కూతలు కూస్తూ ఉంటే చూస్తూ ఊరుకోరన్నారు. నగరి నియోజవర్గ ప్రజలు కూడా అన్నీ గమనిస్తూనే ఉన్నారని.. అతి త్వరలోనే రోజా చెంపలు పగలగొడుతారన్నారు. రోజా ఇకనైనా నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని చిలకలూరిపేట నియోజకవర్గ తెలుగుమహిళా విభాగ నేతలు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జరీనా సుల్తానా, షేక్ నజీరున్నీసా బేగం, పోపూరి లక్ష్మి, అద్దంకి అనిత భాయ్, పాములపాటి శివమ్మ, కూనల ప్రమీల, రాయని హరిత, మిద్దెలవనితా భాయ్, అన్నపుదాసు లక్ష్మి తదితరలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ ఆయాలకు ఇంటర్వ్యూలు




కావలి డిశంబర్ 22 ప్రజాపాలన ప్రతినిధి :పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయంలో బుధవారం అంగన్వాడీ ఆయాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్కుమార్ ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలు జరగగా సంబంధించిన శాఖ అధికారులతో ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు హాజరైన అంగన్వాడీ ఆయాలు మద్యాహ్నం 2గంటల దాకా ఇంటర్వ్యూలలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఆర్డిఓ శీనానాయక్, జాయింట్ కలెక్టర్ గణేష్కుమార్, సిడిపిఓ పద్మజ, డిప్యూటీ డిఎం అండ్హెచ్ఓ ఇతర అధికారులు ఈ ఇంటర్వ్యూలను పర్యవేక్షించారు.

## నారాయణ పాఠశాలలో ఘనంగా నిర్వహించిన మ్యాథ్స్ డే కార్యక్రమం



చిలకలూరిపేట :(ప్రజాపాలన ప్రతినిధి )పట్టణ ములోని నారాయణ పాఠశాలలో నేషనల్ మ్యాథమెటిక్స్ డే సందర్భంగా ది గ్రేట్ ఇండియన్ మ్యాథమెటికల్ రామానుజన్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు క్విజ్ కాంపిటేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు నుండి లక్ష్మారెడ్డి,రాష్ట్ర కోఆర్డినేటర్ అనుపమ ప్రతిభ, ప్రధాన ఉపాధ్యాయుడు శేషగిరిరావు, క్యాంపస్ ఇన్ చార్జ్ స్వామి నాయక్ తదితరులు పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు..

# క్రిస్మస్ కానుక అంటే కరెంట్ కట్ చేయటమేనా..?

**పాత బిల్లులు కట్టలేదని గృహాలకు కరెంట్ కట్ చేసిన విద్యుత్ శాఖ అధికారులు**




గుంటూరు, ప్రజా పాలన : ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే క్రిస్ మస్ పండుగకు చాలా ప్రాముఖ్యత సంతరించుకున్న నేపథ్యంలో భారతదేశమంతా ఈ వేడుకను ప్రజలు ఘనంగా నిర్వహించుకుంటారు ప్రతి పల్లె బడుగు బలహీన వర్గాల నుండి క్రిస్ మస్ పండుగకు వారి బంధువుల నుండి పిలుపు మేరకు ప్రతి ఇల్లు శోభాయమానం ఉంటుంది. ఈ తరుణంలో గుంటూరు జిల్లా కారంపూడి మండలం విద్యుత్ శాఖ బడుగు బలహీన వర్గాలకు క్రిస్ మస్ కానుక వాళ్లకు షాక్ కు గురి చేసింది అసలే కష్టకాలం ఖర్చులకు నోచుకోక ఇబ్బందులు పడుతున్న ఈ తరుణంలో మూలిగే నక్కపై తాటి కాయ చందంగా ఈ చర్య మండల ప్రజలను విస్మయానికి గురిచేసింది దీంతో ఆందోళనకు గురైన మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్ అధికారులకు మొరపెట్టుకున్నా వారి గోడు అరణ్యరోదనగా ఉన్నది. పిల్లలకు పెద్దలకు బట్టలు తో పాటు పండుగ ఖర్చు అధికంగానే ఉంటుంది అసలే కరువు కాలం డబ్బుల్లేక అల్లాడుతుంటే పండుగ ఎలా జరుపుకోవాలి రా బాబు అంటూ సామాన్యుడు ఆలోచిస్తున్న తరుణంలో నెత్తిన మరో పిడుగు పడింది. మండలం లోని ఎస్సీ కాలనీ లో బిల్లులు వెంటనే చెల్లించాలని లేనిచో కరెంట్ కట్ చేస్తామంటూ విద్యుత్ సిబ్బంది ఇంటి వద్దకు వచ్చారు. బిల్లులు కట్టవలసిన అవసరం లేదని మాకు ఉచిత కరెంట్ అని ప్రశ్నించగా గతంలో 50 యూనిట్లు ఫ్రీ అప్పుడు మీరు ఎక్కువగా వాడారు అందుకు బిల్లులు కట్టాల్సిందే.క్రిస్మస్ పండుగ అయ్యా మాకు కొన్ని రోజులు టైం ఇవ్వండి మేము బిల్లులు చెల్లిస్తాము అని కాలనీవాసులు కోరగా అదేం కుదరదు బిల్లు కట్టాలి కుదరదు అంటూ కరెంట్ కట్ చేసుకుంటా వెళ్లిపోయారు ఏం చేయాలో తెలియక అక్కడ ఇక్కడ అప్పు చేసి కొంత చెల్లించిన అనంతరం కరెంటు ఇస్తామని వేడుకోని డబ్బులు చెల్లించిన అనంతరం విద్యుత్ ను పునరుద్ధరించారు.

## ఎస్ఐపీడీఏ నిధులపై ప్రశ్నించిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



ఢిల్లీ.ప్రజాపాలన :వికలాంగులకు వివిధ కార్యక్రమాలు చేపట్టేందుకు, ఆర్థిక సాయం అందించడం కోసం ఉన్న వికాలాంగుల హక్కుల చట్టం అమలవ్వటంలో ఉన్న పథకానికి సంబంధించిన (ఎస్ఐపీడీఏ)నిధుల గురించి మంగళవారం లోక్సభలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ మంత్రి వీరేంద్ర కుమార్ బదులిస్తూ... 2020-21 నుండి ఈ పథకం కింద ఉన్న కాంపోజిట్ రీజినల్ సెంటర్స్ (మిశ్రమ ప్రాంతీయ కేంద్రాలు), డిస్ట్రిక్ట్ డిసేబుల్డ్ రిహాబిలిటేషన్ సెంటర్ (జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రాలు)ను తీసివేసి.. వీటిని దీనదయాల్ వికలాంగుల పునరావాస పథకం (డీడీఆర్ఎస్)తో కలుపబడ్డాయని, ఈ పథకానికి నోషనల్ బడ్జెట్ కింద రూ. 77.50కోట్లు కేటాయింపులు చేసినట్లు వివరించారు. ఎస్ఐపీడీఏ పథకం కింద స్పైనల్ ఇంజ్యూరీ సెంటర్లు (వెన్నెముక గాయాల చికిత్స కేంద్రం).. ఎస్ఎస్ఐసీ, ఐఎస్ఐసీలు జోడించబడ్డాయని తెలిపారు. 2019 20, 2020--21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో నోషనల్ బడ్జెట్ కింద రూ. 42.50కోట్లు కేటాయింపులు చేసినట్లు వివరించారు. వికలాంగులకు పునరావాసం, అవరోధరహిత ప్రాపత్యను అందించేందుకు..ఈ పథకంలోని నిబంధనలకు అనుగుణంగా, కార్యాకలాపాలకు మద్ధతుగా ఉన్న స్వయం ప్రతిపత్తి సంస్థలు, విశ్వవిద్యాలయాలతో సహా కేంద్ర ప్రభుత్వం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన సంస్థలకు ఈ పథకం కింద గ్రాంట్ ఇన్ ఎయిడ్ అందించబడుతుందని మంత్రి వెల్లడించారు. ఈ గ్రాంట్ కోసం 2017-18 నుండి ఇప్పటి వరకు 11 రాష్ట్రాలు మాత్రమే దరఖాస్తు చేసుకుని, నిధులు కూడా అందుకున్నాయని వెల్లడించారు. ఎస్ఐపీడీఏ పథకం కింద ఉన్న అన్ని ఉప పథకాలు సొంత లక్ష్యాలను, మార్గదర్శకాలను కల్గి ఉన్నాయని వెల్లడించారు. ఎస్ఐపీడీఏ పథకం కింద ఉన్న కేంద్ర పథకాలు డిమాండ్ ఆధారితమైనవని, అమలు చేసే ఏజన్సీల నుండి తగిన ప్రతిపాదనల రసీదుపై ఆధారపడి ఉంటాయని వెల్లడించారు. ఎస్ఐపీడీఏ పథకం కింద ఉన్న ఏ ఒక్క ఉపపథకానికైనా పూర్తి ప్రతిపాదనలు, పత్రాలు అందకపోతే న్యిధులు మరొక ఉప పథకానికి ఉపయోగించబడతాయని వెల్లడించారు.

## ప్రముఖ పద్యకవి షేక్ ఆలీ కి అవార్డు... అభినందించిన పలువురు ప్రముఖులు



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)ప్రముఖ పద్య కవి షేక్ అలీ మాస్టారుకు నాగభైరు కొటేశ్వరావు అవార్డు లభించింది. నాగభైరు శిష్యులు ప్రముఖ సాహితీవేత్త డా.భూసరపల్లి వెంకటేశ్వర్లు ప్రతి ఏటా ఓ పద్య కవికి ఈ అవార్డు ప్రధానం చేస్తారు. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక శాఖా గ్రంధాలయంలో ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ అవార్డు క్రింద జ్ఞాపిక, నగదు బహుమతి అందజేసి ధుశాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా భూసరపల్లి మాట్లాడుతూ అలీ మాస్టారుకు అవార్డు ప్రధానం చేయడం పట్ల ఎంతో గర్వాంగా ఉందన్నారు. అలీ ముస్లీమ్ అయినప్పటికీ మత సామరస్యానికి ప్రతీకగా నిలిచి క్రైస్తవ, హిందూ దేవుళ్ళకు సంబంధించిన శతకాలు రాసరన్నారు. ఇందులో భాగంగా అలీ మాష్టారు రాసిన 'శ్రీమద్భగవద్గీత ఆంధ్ర పద్యానువాదమ్' పుస్తకాన్ని పారిశ్రామిక వేత్త లంకా ఆదినారాయణ రెడ్డి ఆవిష్కరించారు. సభకు సాహితీ విమర్శకులు డా. పి.వి సుబ్బారావు అధ్యక్షత వహించగా, మరో సాహితీవేత్త విడదల సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లం కొండ వీరాంజనేయులు, శ్యాం మోహన్, దివి రామ బ్రహ్మం, మోడరన్ మహేష్, వెంకటరెడ్డి, రామిరెడ్డి, సయ్యద్ జానీ బాషా, దార్ల బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు కట్టలేదని విద్యార్థిని అవమానించిన మెడరన్ కళాశాల యాజమాన్యం...

**మనస్థాపంతో ఉరివేసుకొని విద్యార్థి ఆత్మహత్య ప్రయత్నం**

**గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి వంశీకృష్ణ**



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)ఫీజులు కట్టలేని వాడికి ఈ కాలేజిలో చదివే అర్హత లేదు.. పట్టణంలోని ప్రైవేటు కళశాల యాజమాన్యం చేసిన అవమానం ఒక విద్యార్థి ప్రాణాలు తీసుకోవటానికి కారణమయ్యాయి. విద్యార్థి తల్లితండ్రులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని భవనారుషినగర్కు చెందిన 16 సంవత్సరాల కారెంపూడి వంశీకృష్ణ పట్టణంలోని మోదరన్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. తండ్రి శివనాగేశ్వరరావు కూలీ పనులు చేసుకొని జీవనాన్ని గడుపుకొస్తున్నారూ. అయితే ఫీజు బకాయి ఉండటంతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు రెండు రోజుల కిందట తరగతి గదిలో విద్యార్థి వంశీకృష్ణను లేపి అందరిముందు ఫీజు కట్టలేని వాడికి ఈ కళాశాల చదువులెందుకు అని అవహేళనగా మాట్లాడారు. ఇంటికి పంపించి వేశారు. ఇంటికి వచ్చిన వంశీకృష్ణ జరిగిన సంఘటనను తల్లిదండ్రులకు చెప్పి మదన పడ్డాడు. తల్లిదండ్రులు సర్ధిచెప్పి ఫీజు కడతామని సముదాయించారు. అయినా కళాశాలలో జరిగిన అవమనభారం ఆ విద్యార్థిని కలచి వేసింది. బుధవారం మధ్యాహ సమయంలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాను ఉరివేసుకున్నాడు. చుట్టుపక్కలవారు గమనించి పట్టణంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ విద్యార్థి పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలిసింది. ఇదే విషయంపై గుంటూరు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఫీజు కట్టలేదని తమ కుమారుడిని అవమానానికి గురి చేసిన కళశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రలు కోరుతున్నారు.

# ప్రేమతత్వానికి ప్రతిరూపమే ఏసుక్రీస్తు: విడదల రజిని

## వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి )ప్రేమతత్వానికి ప్రతిరూపమే ఏసుక్రీస్తు అని చిలకలూరిపేట శాసనసభ్యురాలు విడదల రజిని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డులో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే విడదల రజిని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభువుని ఆరాధించి, మహిమపరిచి, ఘనపరచుటయే నిజమైన క్రిస్మస్ అని తెలిపారు. క్రీస్తు సందేశం ప్రకారం సంఘ జీవులంతా కలిసి మెలిసి ఉండాలని తెలిపారు. మనస్పర్థలు, స్వార్థం, ఆగ్రహం, ఆవేశం లాంటి లక్షణాలన్నీ వదిలేయాలన్నారు. ప్రజలంతా ఒకరినొకరు ప్రేమించుకుంటూ శాంతి స్వభావులుగా ఉండాలని పేర్కొన్నారు. క్రీస్తు చెప్పిన సందేశం ఇదేనన్నారు. ఇప్పుడు మనమంతా కలిసి ఇలా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకుంటున్నామని, ఇది మన ఐక్యతకు సంకేతమని, మనం ఎప్పుడూ ఇలానే ఉండాలని పిలుపునిచ్చారు. మన మధ్య గొడవలకు తావు ఉండకూడదన్నారు. ఎవరైనా గొడవలు పెట్టాలని చూస్తే.. వారి స్వభావాన్ని గుర్తించి వారికి మనం దూరంగా ఉండాలని తెలిపారు. దేవుడి కారణాన మనమంతా ఇలా కలిసి వేడుకలు నిర్వహించుకుంటున్నామని, ఈ స్ఫూర్తిని మనం ఎప్పటికీ కొనసాగించాలని చెప్పారు. అప్పుడే మనందరికీ నిజమైన క్రిస్మస్ అని తెలిపారు. కార్యక్రమానికి 2వేల మందికిపైగా హాజరయ్యారు. అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు జి రాజశేఖర్ ,కొర్రపాటి రాజేష్, పుల్లగూర అనిల్,దావల అబ్రహం, సానం అనిల్,పాల్ రాజ్,మార్కెట్ యార్డ్ చైర్మన్ మద్దిరాల విశ్వనాథం,వైస్ చైర్మన్ కూనల సుబ్రమణ్యం,యడ్లపాడు ఎంపీపీ పిడతల ఘూన్సీదయాసాగర్,నాదెండ్ల ఎంపీపీ తలతోటి రాణి.చిలకలూరిపేట ఎంపీపీ దేవినేని శంకరరావు,మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని ,వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు,వలేటి వెంకటేశ్వర్లు,నాదెండ్ల మండల జడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్ రావు,చిలకలూరిపేట మండల జడ్పీటీసీ కోడె సుధారాణి, యడ్లపాడు మండల జడ్పీటీసీ ముక్తా వాసు,పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహ ఖాన్,నాదెండ్ల మండల అధ్యక్షుడు గొంతు శ్రీనివాసరెడ్డి,యడ్లపాడు మండల అధ్యక్షుడు కల్లూరి విజయ కుమార్,3 వ వార్డ్ కౌన్సిలర్ పిల్లి సాగర్,9 వ వార్డ్ కౌన్సిలర్ చింతపల్లి విల్సన్,12 వ వార్డ్ కౌన్సిలర్ యడ్ల ఇందిర,17 వ వార్డ్ కౌన్సిలర్ పుల్లగూర అనురాధ,32 వ వార్డ్ కౌన్సిలర్ కొచ్చెర్ల విజయలక్ష్మి,యార్డ్ డైరెక్టర్ సాతులూరి ప్రసన్న,కనపర్రు సర్పంచ్ పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు, రాజాపేట సర్పంచ్ జడ జతీన్ దేవ్,జిల్లా యస్ సి సెల్ కార్యదర్శి అన్నలదాసు శ్యాం పాల్, న్యాయవాది దాసరి చిట్టిబాబు,మండల యస్.సి సెల్అధ్యక్షులు వందుల బుల్లెబ్బాయి,పట్టణ యస్.సి సెల్ అధ్యక్షులు బండారు వీరయ్య,కొప్పుల శ్యామ్ పాల్వ,వడ్లన అంకమ్మరావు, జంగా ప్రసన్న కుమార్,యామర్తి కోటేశ్వరరావు,పాపారావు,వేల్పుల సాంబయ్య,కుల్లి ఏసుబాబు,నలమాల సుబ్బారావు,కావూరు బుల్లి ,చప్పిడి బాలస్వామి,గేరా మునలయ్య, వర్సెపోగు చంటి,బండారు జయకుమార్ ,బండారు దాసు,సుదర్శనం వెంకయ్య,అల్లాడి ఆదిబాబు,దార్ల ఏలీయా,కొరివి రంగయ్య,దాసరి మర్దు,కొరివి రంగయ్య,అన్నలదానం బుల్లి,సాతులూరి రవి,సాతులూరి సతీష్,మోషే,బొంత ప్రభుదాస్ మరియు పలువురు పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌డిసితో హీరో వైర్డ్ భాగస్వామ్యం

విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి : భారతదేశంలో అగ్రగామి ఎడ్‌టెక్ కంపెనీ హీరో వైర్డ్ ఇప్పుడు జాతీయ కౌశల్యాభివృద్ధి కార్పొరేషన్ తో భాగస్వామ్యాన్ని కలిగి ఉండగా, ఇంటర్న్‌షిప్‌లు, వ్యాపార ప్రాజెక్టులు, ఆర్థిక మద్ధతును వృత్తి నిపుణులు, ఉన్నత విద్య ఆకాంక్షులకు అందిస్తోంది. ఈ భాగస్వామ్యం వృద్ధిలోకి వస్తున్న, సంబంధిత సాంకేతికతలైన డ్రోన్ అలవర్చుడం మరియు గేమ్ డిజైనింగ్ తదితరాలను అభివృద్ధి చేసే లక్ష్యాన్ని కలిగి ఉంది. సాంకేతిక ఆవిష్కారాత్మక భాగస్వామిగా ఎన్ఎస్‌డిసికు హీరో వైర్డ్ లెర్నర్లకు ప్రమాణీకరణకు డిజిటల్ ప్లాట్‌ఫారాన్ని సృష్టించడం ద్వారా మద్ధతు ఇవ్వనుంది. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ఎన్ఎస్‌డిసి భవిష్యత్తుకు–సిద్ధంగా ఉండే వర్క్‌ఫోర్సును అన్ని వలయాల్లో మెరుగైన కౌశల్య శిక్షణ ద్వారా సృష్టించేందుకూ మద్ధతు ఇవ్వనుంది. ఈ భాగస్వామ్యం హీరో వైర్డ్‌కు కౌశల్య రంగంలో మార్పు తీసుకురావాలన్న ఎన్ఎస్‌డిసి లక్ష్యాన్ని నెరవేర్చడంలో సకారాత్మక పాత్రను పోషించేందుకు సిద్ధమైంది.

## క్రీస్తు జననం సకల జనులకు పాపా పరిహారం



కడప జిల్లా ,ప్రజాపాలన ప్రతినిధి : క్రీస్తు ప్రభువు పేదల కోసం పాపుల కోసం ఆయన ఈ లోకానికి వచ్చాడని, వారితో కలసి జీవించాడని వారిని స్వస్థపరచు పరిశుద్ధులుగా మార్చాడని సెయింట్ మేరీస్ క్రెథిడల్ విచారణ గురువులు ఫాదర్ బిరుసు రాజా అన్నారు. క్రీస్తు జయంతి ముందస్తు వేడుకలు మరియపురం నందు హిజ్రాలతో పార్ధన నిర్వహించారు. అనంతరం వారిని గౌరవంతో శాలువతో భోకే లతో సన్మానించారు. ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ నపుంసకులు అంటే సమాజంలో చాలా చులకన చూస్తున్నారని, ఇది వారి తప్పేమీ కాదని జన్యుపరమైన లోపం వల్ల మాత్రమే ఇది సంభవిస్తుందని, అలాంటి వారిని తక్కువగా చూడటం తగదని ఆయన అన్నారు. ఆనాడు వ్యభిచారంలో పట్టుబడిందిని స్త్రీ ని రాళ్లతో కొట్టి చంపుతున్న తరుణంలో, అటు, చట్టాన్ని ఇటు, స్త్రీ కి సమ న్యాయం చేశారని ఒకరిపై ఒకరు ఆధిపత్యం తగదని, నీ బలహీనతలను నీవు సరి చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. క్రీస్తు ప్రభువు జననం లోకానికి రక్షణను ప్రసాదించిందని అన్నారు. క్రీస్తు ప్రభువు చూపిన మార్గంలో నడవాలని ఆయన అన్నారు. క్రీస్తు జయంతి ప్రతి ఒక్కరి హృదయంలో జన్మిచేలా హృదయ తలుపులు తెరవాలని, క్రీస్తుప్రభువు నీలో నివాసము చేసిన ఎడల మీరు పరిశుద్ధులని కొనితారు.హాజరైన హిజ్రాలను ఉద్దేశించి కోసం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం వారికి చీరలు మిఠాయిలు కొంత ఆర్థిక నగదును అందజేశారు, ఈ కార్యక్రమంలో సహాయకగురువులు ప్రేమ్ కుమార్,విచారణ పెద్దలు సిబ్బంది పాల్గొన్నారు.

## శాఖలవారీ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించండి:సిఎస్ డా.సమీర్ శర్మ

అమరావతి, ప్రజాపాలన ప్రతినిధి 22 డిశంబరు: వివిధ శాఖల వారీగా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలను నిర్వహించి వీలున్నంత వరకూ ఉద్యోగులకు సంబంధించిన వివిధ సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.సమీర్ శర్మ కార్యదర్శులను ఆదేశించారు.అలాగే జిల్లా కలెక్టర్ల స్థాయిలో కూడా జిల్లా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలను నిర్వహించి జిల్లా స్థాయిలో పరిష్కారం కావాల్సిన అంశాలను ఆస్థాయిలోనే పరిష్కారం అయ్యేలా చూడాలని చెప్పారు.బుధవారం అమరావతి సచివాలయం మొదటి బ్లాకు సియం సమావేశ మందిరంలో సిఎస్ అధ్యక్షతన కార్యదర్శుల సమావేశం నిర్వహించారు.ఈసమావేశంలో ప్రధానంగా గత కార్యదర్శుల సమావేశంలో చర్చించిన వివిధ అంశాలపై తీసుకున్నచర్యల నివేదిక(ఎటిఆర్)ను సమీక్షించారు.అదే విధంగా వివిధ పెండింగ్ కోర్టు కేసులకు సంబంధించిన అంశాలు,జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాల్లో వచ్చిన వివిధ ఆర్థిక,ఆర్థికేతర అంశాలను ఆయా శాఖల వారీగా తీసుకోవాల్సిన,పరిష్కారించాల్సిన అంశాలపై సిఎస్ సమీక్షించారు.వివిధ శాఖల్లో ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించి వచ్చే ఏడాది నుండి డిపిసి(డిపార్టుమెంటల్ ప్రమోషన్ కమిటీ)కేలండర్లను రూపొందించి సకాలంలో డిపిసిలు నిర్వహించి పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల కార్యదర్శులను ఆదేశించారు.కోర్టు కేసులకు సంబంధించి ఎపి ఆన్లైన్ లీగల్ కేసు మేనేజిమెంట్ సిస్టమ్ (ఎపిఓఎల్సిఎంఎస్)గురించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.సమీర్ శర్మ మాట్లాడుతూ వివిధ కోర్టు కేసుల్లో సకాలంలో కౌంటర్లు దాఖలు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు.కోర్టు కోసులకు సంబంధించి జిపిలు ఇతర న్యాయాధికారులతో సమన్వయంతో పనిచేసేందుకు వీలుగా ప్రతిశాఖలో సంయుక్త కార్యదర్శి లేదా డిప్యూటీ కార్యదర్శి స్థాయిలో న్యాయ పరిజ్ఞానం కలిగిన అధికారిని నోడలు అధికారిగా నియమించాలని సిఎస్ ఆదేశించారు.కోవిడ్ పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కునేందుకు వీలుగా అవసరమైన అన్ని ముందు జాగ్రత్తలతో సన్నద్ధమై ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులను సిఎస్ డా.సమీర్ శర్మ ఆదేశించారు.అంతకు ముందు కోర్టు కేసులకు సంబంధించి రూపొందించిన ఎపి ఆన్లైన్ లీగల్ కేసు మేనేజిమెంట్ సిస్టమ్(ఎపిఓఎల్సిఎంఎస్) గురించి బాబు ఎ వివరించారు.సమావేశంలో సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి(సర్వీస్ వెల్ఫేర్)శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ 12ఏళ్ళ తర్వాత ఎపి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని అక్టోబరులో నిర్వహించడం జరిగిందని తెలిపారు.18అధికారులు,మరో 16 వివిధ సంఘాల ప్రతినిధులు కలిపి 33మందితో కూడిన అత్యున్నత బాడి ఈకౌన్సిల్ అని దీనికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షులని అన్నారు.జెఎస్సి సమావేశంలో వచ్చిన ఆయా అంశాలు, డిమాండులను సంబంధిత శాఖలకు పంపామని తెలిపారు.తొలుత సమావేశానికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ స్వాగతం పలుకగా పలు శాఖల కార్యదర్శులు వారివారి శాఖలకు సంబంధించిన అంశాలపై మాట్లాడారు.ఈసమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అనంతరాము,సాయి ప్రసాద్,అజయ్ జైన్,కరికల వల్లవన్, డా.కెఎస్.జవహర్ రెడ్డి,పూనం మాలకొండయ్య,బి.రాజశేఖర్,ముఖ్య కార్యదర్శులు,ఎస్ ఎస్ రావత్, కృష్ణ బాబు,గోపాలకృష్ణ ద్వివేది,అనిల్ కుమార్ సింఘాల్,ముఖేష్ కుమార్ మీనా,కుమార్ విశ్వజిత్,వాణి మోహన్,శ్యామలరావులతో పాటు పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

## మేకల లక్ష్మణ్ (జాన్ బాబు)కు గౌరవ డాక్టరేట్ ప్రధానం



విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి: గాంధీనగర్ ప్రెస్ క్లబ్ నందు ఇంటర్నేషనల్ క్యాథలిక్ కరిష్మా టిక్ బిషప్ డాక్టర్ కాటూరి ప్రభుదాస్ ఆధ్వర్యంలో సెమి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాపట్ల పార్లమెంట్ ఎంపీ నందిగామ సురేష్ , చింతపల్లి కన్యాకుమార్ పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేసి సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి ఎస్సీ మోర్చా కోనసీమ జోనల్ ఇంచార్జ్ ఆల్ ఇండియా దళిత యాక్షన్ కమిటీ జాతీయ కార్యదర్శి మేకల లక్ష్మణ్ (జాన్ బాబు) సమాజ సేవ మరియు కరోనా మహమ్మారితో పోరాడుతున్న రోగుల మధ్యనే వుండి వారికి ప్రత్యేక సేవలు అందించడం, పర్యావరణం, స్వచ్ఛత పలు అంశాలపై తన సేవలకు గుర్తింపుగా ఫిలిప్పీన్స్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ ను మేకల జాన్ బాబు కు ప్రకటించిందని డాక్టర్ కాటూరి ప్రభుదాస్ తెలిపారు. ఈ సందర్భంగా గౌరవ డాక్టరేట్ ను బాపట్ల పార్లమెంట్ మెంబర్ శ్రీ నందిగామ సురేష్ మేకల లక్ష్మణ్ జాన్ బాబు కు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా గౌరవ డాక్టరేట్ స్వీకరించిన జాన్ బాబు మాట్లాడుతూ సమాజంలో ప్రేమ శాంతి నిర్మించడం కోసం క్రీస్తు భగవానుడు జన్మించారని ప్రేమే మరియు సేవే మార్గంగా ఆయన బోధనలు జరిగాయని క్రీస్తు ప్రభూ జనన శుభాకాంక్షలు తెలుపుతూ సమాజంలో అసమానతలు నిర్మూలించి భారత రాజ్యాంగ హక్కులను కాపాడవలసిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటిన ఘనత భారత ప్రధాని నరేంద్రమోడీ అని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చే దిశలో భారత ప్రధాని నరేంద్రమోడీ అన్ని సామాజిక వర్గాలను సమన్యాయ స్థితిలో పరిపాలిస్తున్నారని భారతదేశం వివిధ సంస్కృతి సాంప్రదాయాలు మరియు వివిధమతాల జాతుల సమ్మెళ్ళనమని అన్నారు, కొందరు రాజకీయ లబ్ధి కోసం బీజేపీ, బిజెపి నాయకుల పై దుష్ప్రచారం చేస్తున్నారని ఇటీవలే భారత ప్రధాని నరేంద్రమోడీ ప్రపంచ క్రైస్తవ పీఠాధిపతి పోప్ ని కలవడం అదేవిధంగా పోప్ ని భారతదేశానికి ఆహ్వానించడం పట్ల భారతదేశంలో క్రైస్తవులు భారత ప్రధాని నరేంద్ర మోడీ పై మరింత నమ్మకం విశ్వాసం పెరిగింది అన్నారు. ఈ వేడుకలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో పాటుగా, క్రైస్తవ మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## థియేటర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన జిల్లా ఎస్పీ




మచిలీపట్నం,ప్రజాపాలన ప్రతినిధి : మచిలీపట్నం నందు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలలో ఉన్నటువంటి సినిమా థిమేటర్లలో పెద్ద హీరోల నివాలను ప్రదర్శించే సమయంలో టిక్కెట్లను బ్లాక్ మార్కెట్ లో అధిక ధరలకు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు మరియు సినిమా వీక్షించడానికి వచ్చే ప్రేక్షకుల సౌలభ్యంకోరకు పార్కింగ్, తినుబండారాలు విక్రయం, వాష్ రూమ్స్ వంటి సౌకర్యాల కల్పన విషయంలో సినిమా థియేటర్స్ యజమానులు తీసుకుంటున్న చర్యలపై జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఐపీఎస్ గారు పోలీస్ అధికారులు మరియు సిబ్బంది తో కలిసి మచిలీపట్నం లోని స్థానిక రేవతి థియేటర్ లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరిగింది.అందులో భాగంగా ఈరోజు జిల్లా ఎస్పీ గారు, బందరు ఆర్డీవో ఖాజావలి గారు, బందరు డీఎస్పీ మాసూం భాషా గారు, మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ గారు, ఇతర పోలీసు అధికారులతో కలిసి రేవతి థియేటర్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సినిమా చూడ్డానికి వచ్చే ప్రేక్షకుల వద్ద టికెట్లు తీసుకుని పరిశీలించి ఎంత ధరకు విక్రయించింది చూశారు. అంతేకాక పార్కింగ్ తిరు బండరాళ్ల విషయంలో ఎలాంటి రేట్లను వసూలు చేస్తున్నది స్వయంగా ప్రజలతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం థియేటర్ లోపల సిట్టింగ్ ఎలా కేటాయించింది కోవిడ్ నియమ నిబంధనలు అనుసరిస్తున్నది లేనిది ప్రత్యక్షంగా పరిశీలించారు.రేవతి థియేటర్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి గవర్నమెంట్ నిర్దేశించిన రేట్లకు సినిమా టెక్కెట్లను విక్రయిస్తున్నది లేనిది,ఆన్లైన్లో టిక్కెట్ రేట్లను, పార్కింగ్ ఏర్పాట్లను, ఎంట్రీ మరియు ఎగ్జిట్ సరిగా ఉన్నది లేనిది, పరిశీలించారు. థియేటర్ల వద్ద ఉన్న క్యాంటీన్లలో తినుబండారాలు యం.ఆర్.పి.రేట్లకు మాత్రమే విక్రయించవలెనని, థియేటర్స్ మరియు వాటి పరిసర ప్రాంతాలలో, ఆన్లైన్లో బ్లాక్ మార్కెటింగ్ జరిగితే దానికి థియేటర్ యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని థియేటర్ యాజమాన్యాన్ని హెచ్చరించడం జరిగింది. సినిమా హాల్ బయట ప్రాంతంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజా జీవనానికి అంతరాయం లేకుండా చూడాలని సూచించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవో నెంబర్ 35 ప్రకారం నిర్దేశించన నిబంధనల ప్రకారం సినిమా థియేటర్ లో టిక్కెట్ విక్రయాలు జరగాలని వాటికి అనుగుణంగా నడుచుకోవాలని వారికి తెలియజేయడం జరిగింది. అంతేకాక ప్రేక్షకుల అందరికీ తెలిసేలా ధరల పట్టిక ఉండాలని, సినిమా హాల్ చుట్టుపక్కల ప్రాంతం పరిశుభ్రంగా ఉంచాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం కాకుండా అధిక రేట్లకు విక్రయిస్తున్నరని మా దృష్టికి వస్తే చట్టప్రకారం చర్యలకు ఉపక్రమించాల్సి వస్తుందని, దాన్ని పూర్తి బాధ్యత థియేటర్ యాజమాన్యం పై ఉంటుందని హెచ్చరించారు.సినిమా వీక్షించడానికి వచ్చిన ప్రజలతో ఎస్పీ ప్రత్యక్షంగా మాట్లాడి అక్కడ విక్రయించిన టికెట్ల ధరల గురించి వాకబు చేశారు. అధిక ధరలకు విక్రయిస్తున్నారని మీ దృష్టికి వస్తే వెంటనే మాకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

## నిత్యజీవితంతో గణితం ముడిపడి ఉంది - రాజమహేంద్రవరం డిగ్రీ కళాశాల సీనియర్ అధ్యాపకులు ప్రో. కె. నవీన్ కుమార్



ఏలూరు,ప్రజాపాలన ప్రతినిధి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బుధవారం గణిత మేధావి రామానుజం 134 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ, మన నిత్య జీవన విధానం లో గణితం ఎంత ముఖ్యమైనదని, దానిని మీరెవరైనా గుర్తించారా ? అడిగారు. నిత్య జీవితంలో ఏ వృత్తిని నిర్వహించాలన్నా , ఏ పనిని చేయాలన్నా గణితశాస్త్ర పరిజ్ఞానం లేనిదే అది సంపూర్ణం కాదన్నారు. మన జీవన గమనంలో సరైన దృక్పథంతో నడుచు కోవాలంటే గణితశాస్త్ర పరిజ్ఞానం లేనిదే సాధ్యం కాదన్నారు. కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె. సునీత మాట్లాడుతూ, గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ యువతకు ఆదర్శప్రాయుడని అన్నారు. చిన్న తనంలోనే అపారమైన మేధాస్సుతో ప్రపంచం కొనియాడబడే మేధావిగా గుర్తింపు పొందరన్నారు. భారత దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పే 3900 పైగా సమీకరణాలు, సూత్రాలు రూపుదిద్దేరన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, ఏ వృత్తి కాని ఏ విభాగం కానీ కొంత గణితం జోడించనిదే సంపూర్ణం కాదన్నారు. గణితం లేకుండా జీవితం ఊహించుకొవడం అసాధ్యం అని పేర్కొన్నారు. నేటి ఆధునిక కాలంలో గడియారం లేదా కాలెండర్ లేని మీ జీవితాన్ని ఊహించడం సాధ్యం కాదన్నారు. సైన్స్, ఫీజిక్స్, కెమిస్ట్రీ వంటి సబ్జెక్ట్ లు గణితం లేకుండా పరిపూర్ణత సాధించ లేవన్నారు. గణితంలో ప్రాథమికంగా పట్టు ఉంటే గణితమన్నది అసలు కష్టమే కాదన్నారు.. నిజానికి గణితం అందరూ ఊహిస్తున్నట్లు సంక్లిష్టమైనది కాదు , కష్టం అనుకున్న వారి దృక్పథమే ఈ విధంగా చేస్తూన్నదన్నారు. మీకు ప్రాథమిక పాఠశాలలో కూడికలను, తీసివేతలను, గుణకారాలను, భాగాహారాలను ఆసక్తి కలిగిస్తే గణితం ఎంతో సులువుగా ఆకళింపు చేసుకోగలుతారని పేర్కొన్నారు. ప్రీస్కూల్ దశ నుండి విద్యార్థులలో ఆసక్తి నెలకొల్పడం కోసం గణితం అమలు చేస్తున్నారు. శ్రీనివాస రామానుజన్ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటడానికి రాబర్ట్ కనిగల్ రామానుజన్ జీవిత చరిత్రను 'ది మ్యాన్ హూ నో ఇన్ఫినిటీ: ఎ లైఫ్ ఆఫ్ ది జీనియస్ రామానుజన్' అనే పేరుతో రాశారు. 2015లో ఆయనపై 'ది మ్యాన్ హూ నో ఇన్ఫినిటీ' సినిమా కూడా తీశారన్నారు.ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు ఆన్లైన్ వ్యాస రచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి. శ్రీనివాసరావు, జనార్దన్ రావు, నరసింహ, రమేష్ కుమార్, సాధిక్ అహ్మద్, తిరుపతి రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకొని అన్నిరంగాల్లో రాణించాలి ఎలిజిత్ రాణి



గన్నవరం,ప్రజాపాలన ప్రతినిధి డిసెంబర్ 22:గన్నవరం మండలం గొల్లనపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకొని అన్ని రంగాలలో విజయం సాధించాలని జడ్పిటిసి సభ్యులు అన్నవరపు ఎలిజబెత్ రాణి సూచించారు గణిత శాస్త్రవేత్త రామనుజం జన్మదినోత్సం సందర్భంగా జాతీయ గణితోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో ప్రధాన ఉపాధ్యాయులు కె ఎస్ జగన్ మోహన్ రావు యంపీటీసీ సభ్యులుమొరంనాగమణి, తమిశెట్టి.రఘుబాబు సత్యనారాయణ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జగనన్న తోడు పథకం ద్వారా చిరు వ్యాపారాల రుణాలకు బ్యాంకులకు ప్రతిపాదనలు



లింగాల,ప్రజాపాలన ప్రతినిధి : మండలం లో జగనన్న తోడు పథకం ద్వారా చిరు వ్యాపారాలు మరియు సాంప్రదాయ చేతివృత్తులు చేసుకుంటున్న వారికి పదివేల రూపాయలు సున్నా వడ్డీకే మంజూరు చేయుటకు బ్యాంకులకు ప్రతిపాదనలు పంపుతున్నట్టు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ వైయస్సార్ క్రాంతి పదం ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ లింగాల శాఖ నందు 370 అప్లికేషన్స్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పార్నపల్లి శాఖ నందు 231, కోమన్నూతల నందు 39 అప్లికేషన్స్, ఏపీజీబీ పులివెందుల నందు 40 ఏపీజీబీ వెలిదండ బ్రాంచ్ నందు 27, ఏపీజీబీ నల్లపు రెడ్డి పల్లి బ్రాంచ్ నందు సంబంధిత బ్యాంకు మేనేజర్ లకు జగనన్న తోడు లోన్ అప్లికేషన్స్ సమర్పించడం జరిగిందని తెలిపారు. డిసెంబర్ 28 తేదీ ముఖ్యమంత్రి గారు 3 వ విడత జగనన్న తోడు పథకం ప్రారంభిస్తారని తెలిపారు ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్ లు జయపాల్ నాగార్జున జ్యోతి గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు పాల్గొన్నారు



## మెమోరీస్ ఆఫ్ 'శ్యామ్ సింగ రాయ్'




ఒక సినిమా షూటింగ్ దశలోనే అది ఏ స్థాయిలో చిరస్థాయిగా నిలిచిపోనుందో ముందే తెలిసిపోతుంటుంది. అంతే కాకుండా ప్రాణం పెట్టి వర్క్ చేసిన సినిమా ఫలితాన్ని కూడా ముందు ఊహించేసిన నటీనటులు మేకర్స్ ఆ సినిమాకు సంబంధించిన మెమరీస్ ని బద్రంగా చూసుకుంటుంటారు. అలాంటి సందర్భాన్నే శ్యామ్ సింగ రాయ్ టీమ్ ఆస్వాదిస్తోంది. ఈ సినిమా షూటంగ్ సందర్భంగా ఆన్ లొకేషన్ లో తీసుకున్న ఫొటోలని తాజాగా మేకర్స్ విడుదల చేశారు. నేచురల్ స్టార్ నాని ద్విపాత్రాభినయం చేసిన చిత్రమిది. రాహుల్ సంక్రీత్యన్ సరికొత్త కథతో చేసిన ప్రయోగమే ఈ సినిమా.వెంకట్ బోయినపల్లి నిహారిక ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై కేవలం నాని టాలెంట్ పై వున్న నమ్మకంతో ధైర్యం చేసి నిర్మించిన చిత్రమిది. యూత్ హార్ట్ త్రోబ్స్ సాయి పల్లవి కృతిశెట్టి మడోన్నా సెబాస్టియన్ హీరోయిన్ గా నటిచారు. టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ తో సరికొత్త నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 24న ప్రపంచ వ్యాప్తంగా ఐదు భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రధాన భాగం కోల్కతా నేపథ్యంలో సాగనుంది.ఈ చిత్రంలో నాని ద్విపాత్రాభినయం చేసిన విషయం తెలిసిందే. ఒక పాత్రలో ఫిల్మ్ మేకర్ వాసుగా మరో పాత్రలో జర్నలిస్ట్ శ్యామ్ సింగ రాయ్ గా కనిపించబోతున్నారు. ఇందులో సాయి పల్లవి దేవదాసీగా కథకు కీలకమైన పాత్రలో నటించింది. ఆమె పాత్ర సినిమాలో కీలకంగా నిలవనుంది. ప్రీ ఇండిపెండెంట్ సమయంలో బెంగాళ్ లోని స్త్రీలు దేవదాసీ వ్యవస్థని ఎదుర్కొని దుర్భర జీవితాన్ని గడిపారు. దీన్ని ప్రశ్నిస్తూనే అత్యాచారాలు సమాజిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన ఓ వ్యక్తి కథని ఇందులో ప్రధానంగా చూపించారు. సరికొత్త నేపథ్యంలో నానిని కొత్తగా ప్రజెంట్ చేసిన ఈ సినిమాకు సంబంధించిన వర్కింగ్ స్టిల్స్ ని చిత్ర బృంద తాజాగా విడుదల చేసింది. మెమోరీస్ ఆఫ్ శ్యామ్ సింగ రాయ్గా ఈ ఫొటోలు నెట్టింట వైరల్ గా మారాయి. బెంగాల్ వాతావరణం.. 1970లో జరిగే కథ కోసం క్యారెక్టర్ లని మలిచిన తీరు.. వారి కాస్ట్యూమ్స్ కోసం దర్శకుడు పడిన కష్టం తాజాగా విడుదల చేసిన ఆన్ లొకేషన్ స్టిల్స్ లో కనిపిస్తోంది. దీంతో ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

### నాగార్జున "బంగార్రాజు" విడుదల పై టెన్షన్




బిగ్గెస్ట్ ఫెస్టివల్ కి రిలీజ్ తేదీ లో మార్పులు జరిగాయి. ఇప్పటికే సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా నటిస్తున్న సర్కారు వారి పాట చిత్రం పోస్ట్ పోన్ కాగా, పవన్ కళ్యాణ్ భీమ్లా నాయక్ ఫిబ్రవరి కి వాయిదా పడింది. ప్రస్తుతం సంక్రాంతి పండుగ బరిలో రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన రౌద్రం రణం రుధిరం చిత్రం ఉంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ లు ఈ చిత్రం లో కలిసి నటిస్తున్నారు.అదే విధంగా రాధా కృష్ణ కుమార్ దర్శకత్వం లో తెరకెక్కిన రాధే శ్యామ్ చిత్రం సంక్రాంతి బరిలో నిలిచింది. ప్రభాస్ హీరోగా నటిస్తున్నారు. ఆర్ ఆర్ ఆర్ మూవీ జనవరి 7 వ తేదీన విడుదల కానుంది. అదే విధంగా రాధే శ్యామ్ 14 వ తేదీన విడుదల కానుంది. అయితే అక్కినేని నాగార్జున, నాగ చైతన్య రమ్య కృష్ణ, కృతి శెట్టి లు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న బంగార్రాజు చిత్రం విడుదల పై ఇంకా సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఈ చిత్రం జనవరి 15 వ తేదీన విడుదల కావలసి ఉంది. అయితే దీని పై ప్రకటన కోసం నిర్మాతలు, మిగతా సినిమాలు ఎదురు చూస్తున్నాయి. మరి దీని పై నాగ్ టీమ్ ఎలా స్పందిస్తుందో చూడాలి.

## ట్రిపుల్ ఆర్ ఆనందం అంతవరకేనా... ?



ట్రిపుల్ ఆర్ లో ఒక్కసారిగా ధీమా పెరిగింది. తెలుగు స్టేట్స్ వరకూ అన్ని అడ్డంకులూ తొలగిపోయాయి. మధ్యలో పోటీకి వచ్చిన సినిమాలు కూడా తప్పుకున్నాయి. ఇక బోరవిడుచుకుని మరీ గ్రాండియర్ గా రిలీజ్ కి రెడీ అవుతోంది కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది. బాహుబలి వన్ టూ తరువాత ఒక తెలుగు సినిమాకు వేల కోట్ల రెవిన్యూ తీసుకువచ్చిన ఘనుడుగా రాజమౌళిని అంతా కీర్తించారు.ఆ తరువాత వస్తున్న ట్రిపుల్ ఆర్ మూవీ సంగతేంటి అన్న చర్చ కూడా ఒకవైపు ఉంది. మరో వైపు చూస్తే బాహుబలి టూ వేయి కోట్ల పైన కలెక్షన్లు వసూల్ చేసి ఈ రోజుకీ టాప్ ఇండియన్ మూవీస్ లో నంబర్ వన్ ప్లేస్ లో ఉంది. దాన్ని కొట్టడం ఇప్పటిదాకా ఎవరికీ సాధ్యపడలేదు. మరి రాజమౌళి డైరెక్షన్ లో వస్తున్న ట్రిపుల్ ఆర్ మూవీ దాన్ని చేదిస్తుందా అన్నదే ఇక్కడ ఆలోచించే విషయం. అయితే ట్రిపుల్ ఆర్ రిలీజ్ డేట్ ని బట్టి చూస్తే సరైన టైమేనా అన్న మాట కూడా ఉంది. జనవరి 7న ఈ మూ వీ రిలీజ్ అవుతోంది. ఇక జనవరి 14న మరో పాన్ ఇండియా మూవీ రాధేశ్యామ్ రిలీజ్ అవుతోంది. 15న బంగార్రాజు మూవీని నాగార్జున ముందుకు తెస్తున్నాడు అంటు న్నారు.ఆ విధంగా చూసుకుంటే తెలుగు స్టేట్స్ కి సంబంధించి ఎక్కువ థియేటర్లలో ట్రిపుల్ ఆర్ రిలీజ్ అయినా కూడా ఆ సంబరం అంతా తొలి వారానికే పరిమితం అని అంటున్నారు. 14న రాధేశ్యామ్ మూవీ రిలీజ్ కావడంతో సగం థియేటర్లను ట్రిపుల్ ఆర్ వదులు కోవాల్సి ఉంటుంది. ఇక నాగార్జున మూవీకి కూడా మరికొన్ని థియేటర్లు త్యాగం చేయాలి. అలా చూసుకుంటే ఎంత కలెక్షన్లు కొల్లగొట్టుకున్నా కేవలం ఫస్ట్ వీక్ మాత్రమే తప్ప ఆ తరువాత ఆ ఊపు తగ్గిపోతుంది అన్నదే పాయింట్. లాంగ్ రన్ లో బాహుబలి మాదిరిగా హెవీ రెవి న్యూని కలెక్ట్ చేసే పరిస్థితి అయితే ట్రిపుల్ ఆర్ కి ఉంటుందా అన్నదే ట్రేడ్ పండితుల చర్చగా ఉంది. అదే సమ్మర్ కి కనుక ఈ మూవీ వచ్చి ఉంటే కనీసం పదిహేను నుంచి ఇరవై రోజుల పాటు సోలోగా బొమ్మ లాగించేయడానికి చాన్స్ ఉండేదన్న మాట కూడా ఉంది. ఏది ఏమైనా ట్రిపుల్ ఆర్ ఇప్పటికే లేట్ అయింది కాబట్టి ఈ రిలీజ్ అనివార్యం. దాంతో కలెక్షన్ల మోత ఎలా ఉంటుంది అన్న ఆసక్తి అయితే అందరిలో ఉంది.

## శ్రీవారి సమక్షంలో 'పుష్ప 2' ప్రకటన



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన పుష్ప సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. చిత్ర యూనిట్ సభ్యులు చెబుతున్న దాని ప్రకారం ఈ సినిమా రెండు వందల కోట్ల రూపాయలకు పైగా వసూళ్లు దక్కించుకుందట. లాంగ్ రన్ లో మరింతగా ఈ సినిమా వసూళ్లను నవోదు చేస్తుందనే టాక్ వినిపిస్తుంది. భారీ ఎత్తున అంచనాలున్న ఈ సినిమా ను పాన్ ఇండియా రేంజ్ లో విడుదల చేయడం జరిగింది. అన్ని చోట్ల కూడా సినిమా మంచి పాజిటివ్ కలెక్షన్స్ ను రాబట్టిన నేపథ్యంలో చిత్ర యూనిట్ సభ్యులు తాజాగా తిరుపతిలో భారీ సక్సెస్ వేడుక నిర్వహించారు. అల్లు అర్జున్ పాటు చిత్ర యూనిట్ సభ్యులు ఈ వేడుకలో పాల్గొన్నారు.పుష్ప సక్సెస్ వేడుక లో పాల్గొన్న చిత్ర యూనిట్ సభ్యులు నేడు తెల్లవారు జామున శ్రీవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారట. వీఐపీ ప్రారంభం దర్శన సమయంలో వీరు స్వామి వారిని దర్శించుకున్నారు.ఆ తర్వాత వేద పండితులు చిత్ర యూనిట్ సభ్యులకు ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆ తర్వాత బయటకు వచ్చిన చిత్ర యూనిట్ సభ్యులు సినిమా మంచి విజయాన్ని దక్కించుకున్నందుకు గాను స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చినట్లుగా ప్రకటించారు. అదే సమయంలో నిర్మాతల్లో ఒకరు పుష్ప 2 గురించిన అధికారిక ప్రకటన మరోసారి చేయడం జరిగింది.పుష్ప రెండు పార్ట్ లుగా రాబోతున్న విషయం తెల్సిందే. మొదటి పార్ట్ ను విడుదల చేసిన రోజే రెండవ పార్ట్ ను గురించిన విషయాన్ని ప్రకటించారు. తిరుమల శ్రీవారి సన్నిదానంలో మరోసారి పుష్ప 2 గురించిన ప్రకటన చేయడం జరిగింది. పుష్ప 2 ను వచ్చే ఏడాది ఫిబ్రవరి నుండే ప్రారంభించబోతున్నట్లుగా ప్రకటించారు.పుష్ప రెండు పార్ట్ లకు మధ్యలో బన్నీ ఒక సినిమాను చేస్తాడనే వార్తలు వచ్చాయి. కాని పుష్ప 2 ఫిబ్రవరి నుండే మొదలు కనుక బన్నీ మరే సినిమాను మొదలు పెట్టే అవకాశాలు లేవని తెలుస్తోంది. పుష్ప 2 కు సంబంధించి ఇప్పటికే స్క్రిప్ట్ రెడీగా ఉండి ఉంటుంది. కనుక ఎక్కువ సమయం లేకుండా వచ్చే ఏడాది మళ్లీ ఇదే టైమ్ కు విడుదల చేసే అవకాశాలు ఉన్నాయంటున్నారు.

## పుష్ప ప్రచారానికి సామ్ స్కిప్ కారణం?




సమంత కెరీర్ లైఫ్ జర్నీ గురించి అభిమానులకు పరిచయం అవసరం లేదు. కెరీర్ లో ఎన్నో వైవిధ్యమైన చిత్రాల్లో నటించి అవార్డులు రివార్డులతో పాటు ప్రేక్షకుల మెప్పు పొందిన సమంత ఇటీవల పుష్ప చిత్రంలో ఐటమ్ నంబర్ తో ఆశ్చర్యపరిచారు. ఊ అంటావా ఊఊ అంటావా? పాటలో సమంత ఎక్స్ ప్రెషన్స్ .. ఆరబోత గురించి యూత్ పదే పదే ముచ్చటించుకుంటున్నారు. పుష్ప విజయం లో ఈ పాటకు కచ్చితంగా ఒక వాటా ఉందని విశ్లేషిస్తున్నారు. సమంతలో హాట్ కంటెంట్ గ్లామర్ యాంగిల్ పై మరోసారి ఆసక్తికర చర్చ సాగింది. అయితే సమంత అలాంటి చార్ట్ బస్టర్ ఐటమ్ నంబర్ లో నర్తించినా కానీ ఎక్కడా ప్రచారంలో కనిపించలేదు ఎందుకనో! అంటూ సందేహం వ్యక్తమైంది.దీనికి కారణం కూడా తెలిసింది. తాను ఐటమ్ నంబర్ కి ప్రమోషన్ చేయలేనని మేకర్స్ కి ముందే సమంత చెప్పారట. అంతే కాదు పుష్ప ప్రమోషన్స్ సమయంలో నగరంలో అందుబాటులో లేరని కూడా తెలిసింది. సామ్ అప్పటికే కొచ్చికి వేరే పని మీద వెళ్లారట. దీంతో సమంత ఎక్కడా ప్రచార వేదికలపై కనిపించలేదు. అయితే సమంత తన ఇన్ స్టాగ్రామ్ కథనాల ద్వారా ఊ అంటావా పాటకు ప్రమోషన్ చేయడంతో సరిపెట్టుకున్నారుప్రస్తుతం సమంత వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. శ్రీదేవి మూవీస్ సినిమా.. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సినిమాతో పాటు...ఓ బేబి నిర్మాతలతో హాలీవుడ్ మూవీ ఇలా లైనప్ చాలా పెద్దగానే ఉంది. తదుపరి రాజ్ అండ్ డీకేతో ఓ వెబ్ సిరీస్ లోనూ సమంత నటించనుందని.. నెట్ ఫ్లిక్స్ తో భారీ డీల్ కుదుర్చుకోనుందని కూడా టాక్ వినిపిస్తోంది.

## రామ్ చరణ్ సినిమాకు ఇంట్రెస్టింగ్ ఫ్లాష్ బ్యాక్



శంకర్.. భారతీయ సినిమాని మరో మెట్టు ఎక్కించిన దర్శకులలో ఒకరు. దక్షిణాదిలో భారీ చిత్రాలకు హై టెక్నికల్ స్టాండర్డ్స్ వున్న చిత్రాలకు ఆయన కేరాఫ్ అడ్రస్ గా నిలిచారు. ఒక సినిమాని టెక్నికల్ గా ఈ రేంజ్ లోనూ తీయోచ్చా? అని మేకర్స్ ఆశ్చర్యపడే స్థాయిలో ఆయన తన సినిమాలని తెరకెక్కించారు. ఆయన మేకింగ్ చాలా సందర్భాల్లో టాక్ ఆఫ్ ది ఇండియన్ సినిమాగా నిలిచింది. అంతే కాకుండా శంకర్ కెరీర్ లో ఇప్పటి వరకు చేసిన చిత్రాలన్నీ భారీ బడ్జెట్ లో హై టెక్నికల్ వ్యాల్యూస్ తో చేసినవే.శంకర్ ఎంత టెక్నాలజీని నమ్ముకున్నా నేటీవిటీని భావోద్వేగాలని మాత్రం వీడలేదు. వాటికి సాంకేతికతని జోడించి వెండితెరపై అద్భుతాలు చేశారు. అదే ఆయనని తిరుగులేని దర్శకుడిగా నిలబెట్టింది. ఏ సినిమా చేసిన ఆ కథ వెనక ఓ ఫ్లాష్ బ్యాక్ బలమైన ఎమోషన్ తప్పని సరి. అదే అతని సినిమాలకు ప్రధాన యుఎస్పీగా మారింది. జెంటిల్మెన్ లో వీనీత్ ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్... భారతీయుడులో సేనాపతి ఎపిసోడ్.. అపరిచితుడులో నిర్లక్ష్యం తన చెల్లి చనిపోయిన ఎపిసోడ్... ఇవే ఈ సినిమాలకు ప్రధాన ఆయువు పట్టుగా నిలిచాయి.తాజాగా శంకర్ .. రామ్ చరణ్ తో చేస్తున్న సినిమాకు కూడా ఇదే తరహా ఓ ఎమోషనల్ ఫ్లాష్ బ్యాక్ ని సెట్ చేశారట. ఇదే ఈ సినిమాని ఓ రేంజ్ లో హైలైట్ గా నిలబెడుతుందని చెబుతున్నారు. శంకర్ – రామ్ చరణ్ ల తొలి కలయికలో పాన్ ఇండియా రేంజ్ లో రూపొందుతున్న సినిమా ఇది. ఇందులో చరణ్ కలెక్టర్ గా కనిపించబోతున్నారు. సమకాలీన రాజకీయాలపై శంకర్ సంధిస్తున్న వ్యంగ్యాస్త్రం అని ఇప్పటికే ఇండస్ట్రీ వర్గాల్లో ఈ సినిమా హాట్ టాపిక్ గా మారింది.రాజకీయాల కారణంగా నేటి ఉద్యోగ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు..దాని తీరుతెన్నులు.. ప్రజల కనీస హక్కుల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని ఇన్ సైడ్ టాక్. శంకర్ సినిమాల్లో ప్రధానంగా కనిపించే బలమైన ఫ్లాష్ బ్యాక్ ఈ సినిమాకు కూడా వుంటుందని అదే సినిమాని సరికొత్త మలుపు తిప్పడమే కాకుండా కథనాయకుడి పాత్రకు ప్రధాన బలంగా నిలుస్తుందని చెబుతున్నారు.కొత్త షెడ్యూల్ కథకు కీలకంగా నిలిచే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ నేపథ్యంలో సాగనుందని ఈ షెడ్యూల్ త్వరలోనే ప్రారంభం కానుందని మేకర్స్ చెబుతున్నారు. కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రంలో అంజలి సునీల్ హీరో శ్రీకాంత్ జయరామ్ నవీన్ చంద్ర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. %=జ 15ాఎజ% 50 గా రూపొందుతున్న ఈ మూవీని దిల్ రాజు అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. సాయి మాధవ్ బుర్రా ఈ చిత్రానికి డైలాగ్స్ అందించడం విశేషం.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at : Unyted Publications, From H.no: #5+-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com